



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 269 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ శనివారం 20 జూన్ 2026 పేజీలు : 12 వెల : 2/-


### అమరావతికి కొత్త ఊపు..

# బ్యాంక్ స్ట్రీట్ నిర్మాణంలో వేగం పెంచండి



**డిజిటల్ మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచన**

**నివాస వ్యయం తగ్గించి, ఆదర్శ నగరంగా తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం**


**ప్రకాశం బ్యారేజీ వద్ద జలక్రీడలతో పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు**

**సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో రాజధాని అభివృద్ధిపై చంద్రబాబు సమీక్ష**

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజధాని అమరావతిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, ముఖ్యంగా బ్యాంక్ స్ట్రీట్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాజధానిని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో, నివాసయోగ్యమైన నగరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. సీఎం క్యాంపు కార్యాలయంలో చంద్రబాబు అధ్యక్షతన సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాజధాని అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించి, అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ప్రధానంగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని బ్యాంక్ స్ట్రీట్ నిర్మాణ పురోగతిపై సమీక్షించారు. బ్యాంకుల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి అవసరమైన అనుమతుల ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకూడదని చంద్రబాబు స్పష్టం చేశారు. బ్యాంక్ స్ట్రీట్‌లో కార్యాలయాల ఏర్పాటుకు 13 బ్యాంకులు ముందుకు రాగా, వాటిలో 11 సంస్థలు తమ భవన నిర్మాణ బాధ్యతలను సీపీడబ్ల్యూడీకి అప్పగించాయని అధికారులు సీఎంకు వివరించారు. ఈ నిర్మాణాలను పూర్తి సమన్వయంతో వేగంగా పూర్తి చేసేలా చూడాలని సీఆర్డీఏ అధికారులకు సూచించారు. రాజధానిలో డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి అన్నారు. ఫోన్, కేబుల్, ఇంటర్నెట్ వంటి కనెక్టివిటీ సేవల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో డిజిటల్ వసతులను ఏర్పాటు మిగతా .. 2లో..

### సీఎం చంద్రబాబును కలిసిన

## సాయికృష్ణ కుటుంబసభ్యులు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయవాడలోని కృష్ణలంకకు చెందిన గాదె సాయి కృష్ణ తల్లి విజయలక్ష్మి, కుటుంబసభ్యులు సీఎం చంద్రబాబును కలిశారు. తన కుమారుడి అదృశ్యంపై విచారణ జరిపి న్యాయం చేయాలని విజయలక్ష్మి కోరారు. ఈ సందర్భంగా ఆమెకు సీఎం ధైర్యం చెప్పారు. ఈ ఘటనపై నిష్పక్షపాతంగా ఉన్నతస్థాయి దర్యాప్తు మిగతా .. 2లో..

### 'అరణ్యారామం' భవన ప్రాంగణానికి

# పవన్ చేతుల మీదుగా భూమి పూజ

**రూ. 24 కోట్లతో అటవీశాఖ పరిశోధన, శిక్షణ కార్యక్రమాల పర్యవేక్షణ భవనం నిర్మాణం**

**కామన్ ఫెసిలిటీ సెంటర్‌గా సేవలు అందించనున్న అరణ్యారామం**

**అరణ్యారామం నుంచి అటవీ శాఖ పరిశోధన, శిక్షణ కార్యకలాపాలు**



**తాడేపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖల పరిశోధన, శిక్షణ కార్యక్రమాల పర్యవేక్షణ భవనం అరణ్యారామానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ శంకుస్థాపన చేశారు. మంగళగిరిలోని ఎయిమ్స్ సమీపంలో, బ్రహ్మానందపురం వద్ద సూమారు రూ. 24 కోట్ల అంచనా వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించనున్నారు. ఉదయం 10 గంటల 30 నిమిషాలకు రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, అటవీ శాఖ ఉన్నతాధికారులతో కలసి పవన్ కళ్యాణ్ నూతన భవన ప్రాంగణానికి భూమి పూజ చేశారు. ఈ అరణ్యారామం అటవీ, పర్యావరణ శాఖలకు సంబంధించి పరిశోధనలు, శిక్షణా కార్యక్రలాపాలతోపాటు ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలన్నింటినీ ఒకే వేదిక నుంచి సమన్వయం చేసే మిగతా .. 2లో..

### సంధ్య థియేటర్ ఘటనలో

## అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు సమన్లు



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** సంధ్య థియేటర్ ఘటనలో సినీ నటుడు అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు సమన్లు జారీ చేసింది. సోమవారం విచారణకు హాజరు కావాలని పేర్కొంది. ఈ కేసులో అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి పోలీసులు ఏ11 నిందితుడిగా చేర్చారు. ఏ1 నుంచి ఏ10 వరకు నిందితులుగా సంధ్య థియేటర్ యాజమాన్యం ఉంది. సంధ్య థియేటర్ ఘటనలో ఇప్పటి వరకు 19 మందికి సమన్లు జారీ అయ్యాయి. నిందితుల వ్యక్తిగత హాజరు తర్వాత కేసు విచారణ మిగతా .. 2లో..

# కోనసీమ సమగ్రాభివృద్ధే లక్ష్యం

**జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో మంత్రుల స్పష్టం**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ జిల్లా సర్వతోముఖాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్, సహకార, ఫుడ్ ప్రాసెసింగ్, మత్స్యశాఖల మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. అమలాపురంలో జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్షా కమిటీ సమావేశంలో ఆయన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో కలిసి వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో కనీసం ఒక రైతు బజార్ ఏర్పాటు చేయాలని, అందుకు అవసరమైన స్థలాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు మిగతా .. 2లో..

### అమెరికా దాడిలో మృతి..

## విశాఖకు చేరిన నావికుడు సురేష్ మృతదేహం

**తమ కుటుంబానికి ఆయనే ఏకైక ఆధారమని భార్య ఆవేదన**

**కుటుంబానికి అండగా ఉంటామని ప్రభుత్వ విప్ గణబాబు హామీ**




**విశ్వం వాయిస్ న్యూస్ :** ఒమన్ గల్ఫ్‌లో అమెరికా జరిపిన సైనిక దాడిలో మరణించిన విశాఖపట్నం వాసి, చీఫ్ మెరైన్ ఇంజినీర్ పట్నాల సురేశ్ (44) మృతదేహం శుక్రవారం నగరానికి చేరుకుంది. ఆయన భౌతికకాయాన్ని చూసి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ విషాద ఘటనతో శ్రీనివాస్ నగర్‌లోని ఆయన నివాసం ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. జూన్ 10న ఒమన్ గల్ఫ్‌లో ప్రయాణిస్తున్న 'ఎంటీ సెట్టెబెల్లో' అనే ఆయిల్ ట్యాంకర్‌పై మిగతా .. 2లో..

### సాయికృష్ణ, క్రాంతికుమార్ మరణాలపై

# సీబీఐ విచారణ జరపాలి

**వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు**



**తాడేపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన విజయవాడ సాయికృష్ణ మిస్సింగ్ వ్యవహారం, అలాగే క్రాంతి కుమార్ అనుమానాస్పద మృతి కేసులపై సీబీఐ చేత సమగ్ర విచారణ జరిపించాలని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో సాగుతున్న పోలీసుల దుర్మార్గాలపై తమ పోరాటం ఆగే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సాయికృష్ణ ఇంటికి వైసీపీ అధినేత జగన్ వెళ్లి పరామర్శించే వరకు ఈ ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని ఆయన నిలదీశారు. "గత నెల 28వ తేదీనే అడ్వకేట్ కనకదుర్గ పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేశారు. అయినా సరే బాధ్యులైన మిగతా .. 2లో..

### తిరుపతి జిల్లా అదనపు ఎస్పీగా

## ఆర్ల శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ



**తిరుపతి, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈరోజు ఉదయం 10.00 గంటలకు అదనపు పోలీస్ సూపరింటెండెంట్ (పరిపాలన)గా ఆర్ల శ్రీనివాసులు అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆర్ల శ్రీనివాసులు గతంలో తిరుపతి జిల్లాలో అదనపు ఎస్పీ (క్రైమ్స్)గా సమర్థవంతంగా మిగతా .. 2లో..

### విధ్వంసమైన విద్యాశాఖను

# వికాసం వైపు నడిపిస్తున్నాం

**తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థులు ఆత్మగౌరవంతో పాఠశాలకు వెళ్లేందుకు ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యపై నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రణాళికాబద్ధంగా ముందు కెళున్నామని చెప్పారు. నగరంలోని ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీని గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కలిసి సీఎం ప్రారంభించారు. గురుకుల పాఠశాల విద్యార్థులకు 22 వస్తువులతో కిట్లు అందించారు. వసతి గృహ విద్యార్థులకు 10, పాఠశాల విద్యార్థులకు 7 వస్తువులతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "తెలంగాణ భాషా ప్రయుక్త రాష్ట్రంగానో, పాలనా సౌలభ్యం కోసమో ఏర్పడింది కాదు. 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, విద్యార్థుల ఆత్మ బలిదానాలతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైంది. తెలంగాణ విద్యార్థుల మిగతా .. 2లో..

### నన్ను విమర్శించే ముందు

# మీ ఇంట్లో ఆడవాళ్లను గుర్తుచేసుకోండి


**హోం మంత్రి వంగలపూడి అనిత**



**అనకాపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** 'నా చదువు, కట్టు, బొట్టుపై విమర్శలు చేసే ముందు మీ ఇంట్లో ఆడవాళ్లను గుర్తు తెచ్చుకోవాలి' అని వైకాపా నేతలను ఉద్దేశించి హోం మంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. ముస్తాబు కావడం తప్పా అని ప్రశ్నించారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు వద్ద ఓ కన్వెన్షన్‌లో శుక్రవారం నిర్వహించిన కూటమి రెండేళ్ల పాలన విజయోత్సవ సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. 'నాపై ఎవరు వెకిలిగా మాట్లాడినా, అవమానించినా పట్టించుకోను. వైకాపా పాలనలో నన్ను ఎన్నో రకాలుగా ఇబ్బంది పెట్టి, నిర్బంధాలకు గురిచేశారు. నన్ను ఇన్నిరకాలుగా అవమానించినందుకు నాకున్న పదవితో వారిపై కేసులు పెట్టొచ్చు.. కానీ ఏనాడు అలా చేయలేదు"అని అనిత అన్నారు. ఎన్ని రకాలుగా విమర్శలుచేసి, ఇబ్బందులు పెట్టినా మిగతా .. 2లో..

### నాపై నమ్మకం లేకుంటే.. పార్టీ చీఫ్‌గా

## వైదొలగేందుకు రెడీ : ఉద్ధవ్



**విశ్వం వాయిస్ న్యూస్ :** శివసేన (యూబీటీ)లో కొందరు ఎంపీలు తిరుగుబాటు ప్రయత్నాలు చేస్తున్న వేళ ఆ పార్టీ చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే స్పందించారు. పార్టీ ఫిరాయించిన ఎంపీలకు గత ఎన్నికల్లో ఓటు వేసిన ప్రజలకు తన తరఫున క్షమాపణలు చెబుతున్నానని అన్నారు. ముంబయిలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన ఆయన.. తనపై విశ్వాసం లేకుంటే పార్టీ మిగతా .. 2లో..

### భారత్-పాక్ సరిహద్దుల్లో

## అరుదైన సన్నివేశం



**విశ్వం వాయిస్ న్యూస్ :** జమ్మూ కశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వద్ద భారత్‌లోకి ప్రవేశించిన పాకిస్థాన్ యువకుడిని సైనికాధికారులు గురువారం తిరిగి స్వదేశానికి అప్పగించారు. పాక్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సుకు చెందిన అసద్ ఖాన్ భారత్ నిర్బంధంలో మిగతా .. 2లో..

# గెలుపు నాది.. ఓటమి వాన్సది

**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు**



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాన్‌తో ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో ఒప్పందం విఫలమైతే ఏం చేస్తారని మీడియా అడిగిన ప్రశ్నకు.. 'ఒప్పందం సఫలమైతే ఆ ఘనత నా ఖాతాలో వేసుకుంటా.. విఫలమైతే ఆ నింద జేడీ వాన్స్‌పై వేస్తాను' అంటూ నవ్వుతూ బదులిచ్చారు. కాబట్టి ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఉపాధ్యక్షుడికి సూచించారు. ఇరుదేశాల మధ్య కుదిరిన ఒప్పందంలో టెహ్రాన్ మిగతా .. 2లో..

### వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకి

# బెయిల్ మంజూరు

**షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన రంగారెడ్డి జిల్లా కోర్టు**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ శివారు గండిపేటలో కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా, ఫేక్ జీవో కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడికి రంగారెడ్డి జిల్లా కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు మూడు రోజుల పాటు ఆయనను కస్టడీలోకి తీసుకుని విచారించారు. కస్టడీ ముగిసిన అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం బెయిల్ ఇస్తూ మిగతా .. 2లో..

### ఫుట్‌పాత్‌పై నడవడం

# ప్రాథమిక హక్కు

**సుప్రీం కోర్టు**



**విశ్వం వాయిస్ న్యూస్ :** పాదచారుల భద్రతకు సంబంధించి సుప్రీం కోర్టు కీలక తీర్పు వెలువరించింది. నిర్దేశించిన ఫుట్‌పాత్‌పై నడవడం పౌరులందరికీ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని పేర్కొంది. వాహనాల రాకపోకల కన్నా ఫుట్‌పాత్‌లపై నడిచే వారికే అధిక ప్రాధాన్యత ఉంటుందని జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చందూకర్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. పాదచారుల భద్రతకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్రానికి మిగతా .. 2లో..

### అమెరికా-ఇరాన్

## చర్చలు వాయిదా



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా-ఇరాన్ మధ్య జరగాల్సిన చర్చలు వాయిదా పడ్డాయి. యుద్ధాన్ని ముగించే విషయంపై చర్చలు వాయిదా పడినట్లు స్విట్జర్లాండ్ ప్రకటించింది. ఒప్పందం కుదిరిన కొన్ని గంటలకే ఇజ్రాయెల్-హెజ్‌బొల్లా మిగతా .. 2లో..

## (మొదటిపేజీ తరువాయి)

**‘అరణ్యారామం’ భవన ప్రాంగణానికి**

# పవన్ చేతుల మీదుగా భూమి పూజ

కామన్ ఫెసిలిటీ సెంటర్‌గా సేవలు అందించనుంది. రాష్ట్ర అటవీ పరిశోధన, శిక్షణ కార్యక్రమాలకు అరణ్యారామం వేదిక కానుంది. H.A.N.U.M.A.N. కార్యకలాపాలకు కమాండ్ సెంటర్‌గా, ఆంధ్రప్రదేశ్ గ్రేట్ గ్రీన్ వాల్ కార్యక్రమానికి పర్యవేక్షణ కేంద్రంగా, పులుల సంరక్షణ, అటవీ అగ్నిప్రమాదాల నివారణ, జీవావరణ పునరుద్ధరణ, వాతావరణ స్థిరత్వం, ఎకో-టూరిజం అభివృద్ధి, డిజిటల్ పర్యావరణ పరిపాలన తదితర విభాగాలకు సమన్వయ కేంద్రంగా సేవలు అందించనుంది. అధునాతన సాంకేతికత సాయంతో ప్రకృతి పరిరక్షణ ధ్యేయంగా అరణ్యారామంలో శాస్త్రీయ పరిశోధనలు జరపనున్నారు. క్షేత్ర స్థాయిలో అమలు చేసే కార్యకలాపాలన్నింటినీ ఒకే చోటు నుంచి పర్యవేక్షించే పరిపాలనా కేంద్రంగా నిలవనుంది.

**హనుమాన్ గ్యాలరీల పరిశీలన**

శంకుస్థాపన అనంతరం అరణ్యారామం భవన నమూనా, నిర్మిస్తున్న ప్రదేశానికి సంబంధించిన వివరాలను శ్రీ పవన్ కళ్యాణ్ గారు పరిశీలించారు. మానవ, వన్యప్రాణి ఘర్షణలను నిలువరించేందుకు తీసుకువచ్చిన ఎ.హా.చీ.ఖ.వీ.హా.చీ ఫౌండేషన్ ద్వారా రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్స్ వివరాలతో ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను తిలకించారు. ఒక్క 2024 ఏడాదిలోనే ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ 185 వన్యప్రాణి రక్షణ చర్యలు చేపట్టినట్టు అధికారులు ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్‌కి తెలియజేశారు. మరో 36 మానవ, వన్యప్రాణి సంఘర్షణ నివారణ కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి చేసినట్టు తెలిపారు. నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, అటవీ శాఖ పీసీసీఎఫ్ పివి చలపతి రావు, రాష్ట్ర మెడికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, పీసీబీ ఛైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య, బయో డైవర్సిటీ బోర్డ్ ఛైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్, రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ మెంబర్ సెక్రటరీ ప్రొ.కె.శరత్ కుమార్, అటవీశాఖ ఐటీ సలహాదారు పి.నాగబాబు, అటవీ శాఖ ఉన్నతాధికారులు రేవతి, రాహుల్ పాండే, గుంటూరు జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ, ఎస్పీ వకుళ్ జిందాల్, ఇతర అటవీశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**సంధ్య థియేటర్ ఘటనలో**

# అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు సమన్లు

ప్రారంభం కానుంది. ఇప్పటికే 23 మందిని నిందితులుగా చేర్చి పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేశారు. 2024 డిసెంబర్ 4న పుష్ప-2 సినిమా బెనిఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనలో రేవతి అనే మహిళ మృతి చెందగా.. అమె కుమారుడు శ్రీతేజ తీవ్రంగా గాయపడ్డాడు.

# కోనసీమ సమగ్రాభివృద్ధే లక్ష్యం

నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచాలని డ్రైనేజీ వ్యవస్థ ఆధునికీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువులు, విత్తనాలు సమృద్ధిగా ఉన్నాయని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కోనసీమ తీరప్రాంతాల్లో సముద్రపు నాచు, పీతల పెంపకం వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా మత్స్యకారులు, మహిళా సంఘాలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఆక్వా రంగాన్ని ప్రోత్సహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు మరియు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సమన్వయ లోపాలు కనిపిస్తే క్రమశిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కోనసీమలో శాశ్వత పరిష్కారంగా సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం రూ. 3.20 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించినట్లు వెల్లడించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ కోనసీమను అన్ని రంగాల్లో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. రైతు, మత్స్యకారుడు, మహిళ, యువత, కార్మికుడు అనే తేడా లేకుండా ప్రతి వర్గం సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. జిల్లాలో మౌలిక వసతుల అభివృద్ధి, తాగునీటి సరఫరా, రోడ్ల నిర్మాణం, ఉపాధి అవకాశాల కల్పనలో అధికారులు మరింత చొరవ చూపాలని సూచించారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు వేగంగా, పారదర్శకంగా అందేలా సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, ఎమ్మెల్యేలు దేవ వరప్రసాద్, గిడ్డి సత్యనారాయణ, బండారు సత్యానందరావు, జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియా దేవి మరియు ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

**అమెరికా దాడిలో మృతి..**

# విశాఖకు చేరిన నావికుడు సురేష్ మృతదేహం

అమెరికా దళాలు దాడి చేశాయి. ఈ ఘటనలో ట్యాంకర్‌లోని ముగ్గురు భారతీయ సిబ్బంది మరణించగా, 21 మందిని సురక్షితంగా కాపాడారు. మృతుల్లో పట్నాల సురేశ్‌తో పాటు హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఆదిత్య శర్మ, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన శివానంద్ చౌరాసియా ఉన్నారు. మిగతా ఇద్దరి మృతదేహాలను జూన్ 17నే భారత్‌కు తరలించారు. అమెరికా ఆంక్షలను ఉల్లంఘించి ఇరాన్ నుంచి చమురు రవాణా చేస్తున్నందునే ట్యాంకర్‌పై దాడి చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ప్రకటించింది. అయితే, ఈ దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు అమెరికా రాయబారికి సమన్లు జారీ చేసి తన నిరసనను తెలియజేసింది. ఈ సందర్భంగా సురేశ్ భార్య భార్గవి మాట్లాడుతూ, “మా కుటుంబానికి ఆయనే ఏకైక ఆధారం. ఇప్పుడు నేను నా ఇద్దరు పిల్లలను ఎలా పెంచాలి?” అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) సురేశ్ కుటుంబసభ్యులను పరామర్శించి, ప్రభుత్వపరంగా అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. శుక్రవారం సాయంత్రం సురేశ్ అంత్యక్రియలు నిర్వహించారు.

**సాయికృష్ణ, క్రాంతికుమార్ మరణాలపై**

# సీబీఐ విచారణ జరపాలి

పోలీసులపై ఎందుకు కేసు నమోదు చేయలేదు? జగన్ ఆ కుటుంబానికి అండగా నిలబడేందుకు వెళ్తే తప్ప సీఐ మీద కేసు నమోదు చేయరా? అంటే రాష్ట్రంలో లాకప్ డెత్ జరిగిందని ప్రభుత్వం పరోక్షంగా అంగీకరించినట్లే కదా” అని ప్రశ్నించారు. సాయికృష్ణ పిన్ని కనకదుర్గ హైకోర్టులో పిల్ దాఖలు చేసిన తర్వాతే అసలు కథ ప్రారంభమైందని, కేవలం సీఐ నాగరాజును సస్పెండ్ చేసి చేతులు దులుపుకుంటే సరిపోదని మండిపడ్డారు. పేరిపోగు క్రాంతికుమార్ కూడా సదరు సీఐ పెట్టిన థర్డ్ డిగ్రీ టార్చర్ భరించలేకే ఆత్మహత్య చేసుకున్నాడని, ఈ రెండు మరణాల వెనుక సీఐతో పాటు ఇంకా చాలా మంది ఉన్నతాధికారుల హస్తం ఉందని, వారందరినీ ఈ కేసులో నిందితులుగా చేర్చాలని డిమాండ్ చేశారు. సాయికృష్ణ మృతదేహానికి సంబంధించిన ఫొటోలు, కాళ్లపై ఉన్న గాయాల దృశ్యాలు ఫేక్ అంటూ జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చేస్తున్న ప్రచారాన్ని అంబటి రాంబాబు తీవ్రంగా తప్పుపట్టారు. “అవి ఫేక్ ఫొటోలు అయితే సాయికృష్ణను బతికుండగా చూపించండి. ఒకవేళ నేను చూపించిన ఆధారాలు తప్పు అయితే నాపై లీగల్‌గా కేసు పెట్టుకోండి. చనిపోయిన సాయికృష్ణ కుటుంబం తాము జనసేన పార్టీ వారమని స్వయంగా చెబుతున్నా.. కూటమి నాయకులు ఆ ఇంటికెళ్లి పరామర్శించకపోగా, కేసును రాజీ చేయాలని చూడటం సిగ్గుచేటు. కనీసం ఆ తల్లి అడుగుతున్న సాయికృష్ణ అస్థికలను కూడా ఇవ్వకుండా మాయం చేశారు. జనసేన నాయకులుగా ఉండి సొంత క్యాడర్‌కు న్యాయం చేయలేనప్పుడు ఏం ప్రయోజనం?” అంటూ దుయ్యబట్టారు. విపక్షంగా బాధితులకు న్యాయం చేయాలని తాము చూస్తుంటే కూటమి ప్రభుత్వం తమపై బురద జల్లడం దుర్మార్గమన్నారు. సాయికృష్ణ కేసులో తెరవెనుక ఉన్న పాత్రధారులంతా బయటకు రావాలని, అలాగే దళిత యువకుడు క్రాంతికుమార్ కుటుంబానికి కూడా ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార బలంతో సాయికృష్ణ కుటుంబాన్ని మాయ చేసి ఉండొచ్చు కానీ... నిర్వీర్యమైన పోలీస్ వ్యవస్థ పనితీరుపై, ప్రభుత్వ అరాచక పోకడలపై వైసీపీ చట్టపరమైన, రాజకీయ పోరాటాన్ని కొనసాగిస్తుందని అంబటి రాంబాబు హెచ్చరించారు.

**తిరుపతి జిల్లా అదనపు ఎస్పీగా**

# ఆర్ల శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ

సేవలందించారు. ప్రస్తుతం తిరుపతి జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన)గా నియమితులయ్యారు. పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడుని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు అందుకున్నారు. తిరుపతి జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన)గా బాధ్యతలు స్వీకరించిన ఆర్ల శ్రీనివాసులు తమ అనుభవం, నిబద్ధతతో జిల్లా పోలీసు పరిపాలనను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తారని జిల్లా పోలీసు అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

**భారత్-పాక్ సరిహద్దుల్లో**

# అరుదైన సన్నివేశం

ఉన్నప్పుడు ఆయన్ను గౌరవంతో చూసినందుకు గాను పాక్ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. సైన్యం తెలిపిన వివరాల ప్రకారం.. గతవారం జమ్మూ కశ్మీర్‌లోని టీట్‌వాల్ సెక్టార్ వద్ద నియంత్రణ రేఖను దాటడానికి ప్రయత్నిస్తుండగా పాక్‌కు చెందిన అసద్ ఖాన్ అనే వ్యక్తిని సైన్యం బంధించింది. అసద్‌ను అదుపులోకి తీసుకున్న తర్వాత.. అతడిని విడుదల చేయాలని పాకిస్థాన్‌లోని పలువురు నెటిజన్లు భారత సైన్యాన్ని కోరారు. కొద్ది రోజుల పాటు అతడిని నిర్బంధంలో ఉంచిన అధికారులు అసద్ ప్రవర్తనపై ఎటువంటి అనుమానం రాకపోవడంతో తిరిగి స్వదేశానికి పంపాలని నిర్ణయించుకున్నారు. గురువారం సాయంత్రం సరిహద్దు వద్ద అతడిని పాక్ అధికారులకు అప్పగించారు. అనంతరం ఇరుదేశాల సైనికాధికారులు కరచాలనం చేసుకున్నారు. ఈ అరుదైన క్షణాన్ని భారత సైన్యం సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది వైరల్‌గా మారింది. మానవతా విలువలకు లోబడి భారత సైన్యం పాక్ జాతీయుడిని ఇబ్బంది పెట్టకుండా, గౌరవంగా చూసుకుందని అధికారులు తెలిపారు. సైన్యం నైతిక విలువలకు ఇది ఓ నిదర్శనమన్నారు.

**నాపై నమ్మకం లేకుంటే.. పార్టీ చీఫ్‌గా**

# వైదొలగేందుకు రెడీ : ఉద్ధవ్

అధ్యక్ష పదవి నుంచి వైదొలగేందుకు సైతం సిద్ధంగా ఉన్నానని చెప్పారు. దేశం ‘వన్ పార్టీ.. నో ఎలక్షన్స్’ అనే దిశగా పయనిస్తోందని.. ఇది ప్రజాస్వామ్యానికి ముప్పు అని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు కాంగ్రెస్‌తో తీవ్రమైన రాజకీయ విభేదాలు ఉన్నా.. భాజపా చేస్తున్నట్లుగా శివసేన (యూబీటీ)ని నాశనం చేయడానికి ఆ పార్టీ ఎప్పుడూ ప్రయత్నించలేదని ఉద్ధవ్ పేర్కొన్నారు. 30ఏళ్ల పొత్తు తర్వాత కూడా తాము భాజపాలో విలీనం కాలేదని.. అటువంటిది, కాంగ్రెస్‌లో ఎందుకు విలీనమవుతామని ప్రశ్నించారు.

# అమెరికా-ఇరాన్ చర్చలు వాయిదా

మధ్య పోరాటం ఉద్ధృతమైంది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో 16మంది మృతి చెందారు. దీంతో చర్చలకు తాత్కాలికంగా దూరంగా ఉండాలని ఇరాన్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ చర్చల కోసం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్విట్జర్లాండ్‌కు వెళ్లాల్సి ఉండగా.. చివరి నిమిషంలో తన పర్యటనను వాయిదా వేసుకున్నారు. చర్చలను పునఃప్రారంభించే ముందు లెబనాన్‌పై దాడులు ముగుస్తాయని హామీ ఇవ్వాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. ప్రస్తుతం లెబనాన్‌లో జరుగుతున్న పోరాటాన్ని శాంతింపజేయడానికి మధ్యవర్తులు కృషి చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. అమెరికా-ఇరాన్ మధ్య జరిగిన ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘిస్తోందన్నారు. దీంతో హర్మూజ్‌లో ఆంక్షల సడలింపు, సముద్ర భద్రత, అణు సంబంధిత చర్యలు, ప్రాంతీయ హామీలపై జరగాల్సిన చర్చలు వాయిదా పడినట్లు తెలిపారు.

**లెబనాన్‌ను తగలబెట్టండి.. ఇజ్రాయెల్ మంత్రి**

గురువారం ఇజ్రాయెల్-హెజ్‌బొల్లా మధ్య జరిగిన దాడుల్లో నలుగురు ఇజ్రాయెల్ సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయంపై ఆ దేశ జాతీయ భద్రతా శాఖ మంత్రి ఇటామర్ బెన్ గ్విర్ స్పందిస్తూ.. లెబనాన్ మొత్తాన్ని తగలబెట్టాలని సైన్యానికి పిలుపునిచ్చారు. తమ సైన్యం, ప్రజలు బలిదానానికి సిద్ధంగా లేరని ప్రపంచానికి స్పష్టం చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమస్య మాటలతో తొలగిపోయేలా లేదని.. నిప్పుతో మాట్లాడాల్సిన సమయం వచ్చిందని ఇజ్రాయెల్ ఆర్థిక మంత్రి బెజలెల్ స్మోట్రిచ్ పేర్కొనడం గమనార్హం.

**విధ్వంసమైన విద్యాశాఖను**

# వికాసం వైపు నడిపిస్తున్నాం

ఉజ్వల భవిష్యత్తు, ఉపాధి కోసం ఎంతోమంది త్యాగాలు చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉంది.. వాటిని పునరుద్ధరించాలి. విద్యాశాఖను గతంలో విధ్వంసం చేశారు. గత పాలకుల అరాచకంతో రాష్ట్రానికి పదేళ్ల నష్టం జరిగింది. తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ రూపొందించి ప్రక్షాళన చేపట్టాం. విధ్వంసమైన విద్యాశాఖను వికాసం వైపు నడిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం బడ్జెట్‌లో 8.5 శాతం నిధులు కేటాయించాం. వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం రూ.26,600 కోట్లు ఖర్చు చేస్తున్నాం. వీటిని భావితరాల భవిష్యత్తును నిర్ణయించే పెట్టుబడులుగా భావిస్తున్నాం. ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో నో అడ్మిషన్ బోర్డు పెట్టారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇలా బోర్డు పెట్టే పరిస్థితి వస్తుందని ఎవరూ ఊహించి ఉండరు. ఉద్యోగులకు జీతాల మాదిరిగానే ప్రతినెలా ఒకటో తేదీన విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తాం” అని రేవంత్‌రెడ్డి అన్నారు.

**నన్ను విమర్శించే ముందు**

# మీ ఇంట్లో ఆడవాళ్లను గుర్తుచేసుకోండి

ప్రజలకోసం ఓర్పుగా ఉంటానని, వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని అనిత స్పష్టం చేశారు. తనకు రాజకీయాలు కేవలం ఎన్నికల వరకేనని, ఆ తర్వాత పరిపాలనపైనే దృష్టి ఉంటుందని వివరించారు. పథకాలు, అభివృద్ధి అనేది పార్టీలకతీతంగా చేసి చూపించానన్నారు. గడిచిన రెండేళ్ల కాలంలో ఏనాడూ పైసా అవినీతి చేయలేదని, ఇలా చెప్పాలంటే ధైర్యం ఉండాలన్నారు.

# గెలుపు నాది.. ఓటమి వాన్స్‌ది

ఎలాంటి షరతులు విధించకుండానే లొంగిపోయిందని పేర్కొన్నారు. హర్మూజ్ మూసివేతతో ప్రపంచ వాణిజ్య మార్గాలకు అంతరాయం ఏర్పడడంతో.. ప్రపంచాన్ని ఆర్థిక సంక్షోభం బారి నుంచి కాపాడేందుకు తానే చర్చలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు ట్రంప్ వెల్లడించారు. ఈ ఘర్షణ మరింత విస్తృత ఆర్థిక విపత్తుగా మారకుండా నివారించడానికే ఒప్పందం కుదుర్చుకున్నట్లు ట్రంప్ మీడియా సమావేశంలో పేర్కొన్నారు. తన శక్తికి, అధికారానికి పరిమితులు లేవని వ్యాఖ్యానించారు. మరోవైపు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇజ్రాయెల్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రపంచంలో ఇజ్రాయెల్‌పై సానుభూతి ఉన్న ఏకైక దేశాధినేత ట్రంప్ మాత్రమేనని పేర్కొన్నారు. అమెరికా డబ్బుతోనే ఇజ్రాయెల్ అభివృద్ధి చెందుతోందన్నారు. తమ అతిపెద్ద సమస్య అమెరికా అధ్యక్షుడే అని ఇజ్రాయెల్‌లో ఎవరైనా అనుకుంటే.. వారు ఇప్పటికైనా మేల్కొని తమ దేశం ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితిని గ్రహించాలని సూచించారు. ఇరాన్-అమెరికా చేసుకున్న ఒప్పందంలోని నిబంధనలను పాటించాల్సిన అవసరం లేదని ఇజ్రాయెల్ క్యాబినెట్‌లోని జాతీయ భద్రతా మంత్రి పేర్కొన్న నేపథ్యంలో జేడీ వాన్స్ ఈ వ్యాఖ్యలు చేశారు.

**వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకి**

# బెయిల్ మంజూరు

తీర్పునిచ్చింది. విచారణ సమయంలో, బ్రహ్మనాయుడు కస్టడీలో ఏ ప్రశ్నకు సరైన సమాధానాలు చెప్పలేదని, దర్యాప్తునకు ఆశించిన స్థాయిలో సహకరించలేదని పోలీసులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే, కస్టడీ గడువు ముగిసినందున ఆయన బెయిల్‌కు అర్హుడేనని బొల్లా న్యాయవాదులు వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం... ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. రూ. 20 వేల చొప్పున ఇద్దరు పూచీకత్తులు (ష్యూరిటీలు) సమర్పించాలని ఆదేశించింది. అలాగే, ప్రతి 15 రోజులకు ఒకసారి నార్సింగి పోలీస్ స్టేషన్‌లో వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని, కేసు విచారణను లేదా సాక్షులను ఎలాంటి పరిస్థితుల్లోనూ ప్రభావితం చేయకూడదని కోర్టు స్పష్టమైన షరతులు విధించింది.

**ఫుట్‌పాత్‌పై నడవడం**

# ప్రాథమిక హక్కు

సూచించింది. రహదారులు ఉన్నచోట కాలిబాటను గుర్తించి.. మౌలిక సదుపాయాల కల్పన, వాటి నిర్వహణ చూసుకోవాల్సిన బాధ్యత మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పంచాయతీలపై ఉందని సుప్రీం కోర్టు ఈ సందర్భంగా గుర్తు చేసింది. సురక్షితమైన, సౌకర్యవంతమైన కాలిబాటలు లేకపోవడం, ఒకవేళ అవి ఉన్నప్పటికీ వాహనాలు వాటిని ఆక్రమించుకోవడం అనేది ఓ నాగరికత సమస్యగానే మిగిలిపోతోందని ఆందోళన వ్యక్తం చేసింది. సురక్షితంగా నడిచే హక్కు ఉల్లంఘనకు గురైనప్పుడు.. నష్ట పరిహారం కోసం సంబంధిత విభాగాలపై న్యాయపరంగా చర్యలు తీసుకునే హక్కు పౌరులకు ఉందని స్పష్టం చేసింది. కొంతకాలం క్రితం తండ్రితో కలిసి ఓ బాలుడు పాఠశాలకు వెళ్తుండగా వెనుక నుంచి ఓ లారీ వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. పాదచారుల మార్గంలో లోపాలున్నాయని, పరిహారం అందించాలని కోరుతూ బాలుడి తండ్రి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పరిహారం చెల్లింపు అంశం సుప్రీం కోర్టుకు చేరడంతో ఈ కేసును విచారించిన ధర్మాసనం.. పాదచారుల భద్రతపై కీలక తీర్పు ఇచ్చింది. అంతేకాదు, మృతిచెందిన బాలుడి కుటుంబానికి చెల్లించాల్సిన పరిహారాన్ని రూ.11,44,628కి పెంచుతూ.. రెండు నెలల్లోగా ఈ మొత్తాన్ని చెల్లించాలని బీమా కంపెనీని ఆదేశించింది.

**అమరావతికి కొత్త ఊపు..**

# బ్యాంక్ స్ట్రీట్ నిర్మాణంలో వేగం పెంచండి

చేయాలని ఆదేశించారు. అమరావతిని కేవలం నిర్మించడమే కాకుండా, నివాస వ్యయాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సూచిం చారు. పైప్డ్ గ్యాస్ కనెక్షన్లు, ఇండక్షన్ స్టవ్‌ల వాడకాన్ని ప్రోత్సహించడం, డిస్ట్రిక్ట్ కూలింగ్ వంటి ఆధునిక వ్యవస్థలను అందుబాటులోకి తేవడం ద్వారా ఇది సాధ్య మవుతుందని అభిప్రాయపడ్డారు. రాజధాని సుందరీకర ణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు చెప్పారు. ప్రకాశం బ్యారేజీకి ఎగువన వైకుంఠపురం వరకు ఏడాది పొడవునా నీరు నిల్వ ఉండేలా చూడటం ద్వారా పర్యాటక అభివృద్ధికి అపార అవకాశాలు ఉంటాయని అన్నారు. జల క్రీడలు, స్విమ్మింగ్ వంటి కార్యకలాపాలను ప్రోత్సహించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో కృష్ణా కరకట్ట నిర్మాణం, ఉండవల్లిలో ఎల్పీఎస్ లేఅవుట్ల అభివృద్ధి, పార్కింగ్ కాంప్లెక్స్, జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణం వంటి ఇతర అంశాలపై కూడా చర్చించారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ వర్చువల్‌గా పాల్గొనగా, మున్సిపల్, సీఆర్డీఏ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**సీఎం చంద్రబాబును కలిసిన**

# సాయికృష్ణ కుటుంబసభ్యులు

చేయిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే సీఐని సస్పెండ్ చేసి దర్యాప్తును వేగవంతం చేశామన్నారు. సమగ్ర విచారణ జరిపి నిందితులకు శిక్ష పడేలా చేస్తామని చెప్పారు. తప్పుచేసింది ఎంతటివారైనా ఉపేక్షించబోమన్నారు. కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. న్యాయం చేస్తామని సీఎం హామీ ఇవ్వడంపై విజయలక్ష్మి సంతృప్తి వ్యక్తం చేశారు.

**న్యాయం జరుగుతుందనే నమ్మకం వచ్చింది: సాయికృష్ణ మేనమామ**

తమకు జరిగిన అన్యాయాన్ని సీఎం చంద్రబాబుకు చెప్పామని సాయికృష్ణ మేనమామ ముళ్లపూడి నవరంగ్ తెలిపారు. కుటుంబసభ్యులతో సీఎంను కలిసిన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. “సాయికృష్ణ తల్లి బాధను సీఎం చంద్రబాబు అర్థం చేసుకున్నారు. బాధ్యులైన అధికారులను శిక్షిస్తామని ఆయన చెప్పారు. మాలాంటి సామాన్యులకు న్యాయం జరగదని భావించాం. కానీ.. చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో న్యాయం జరుగుతుందనే నమ్మకం వచ్చింది. రాజకీయంగా మాకు ఎవరిపైనా ద్వేషం లేదు. న్యాయం చేయాలని మాత్రమే సీఎంను కోరాం. ఇలాంటి అన్యాయం మరో మనిషికి జరగకూడదు” అని నవరంగ్ అన్నారు.

# ఎడిటర్ వాయిస్

## లోకేష్ భేటీలు ఆసక్తికరం!

ఏపీలోని టీడీపీ కూటమిలో యువ మంత్రిగా ఉన్న నారా లోకేష్ జాతీయ స్థాయిలో తన పలుకుబడిని మరింతగా పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏపీ మంత్రిగా ఆయన కేవలం రాష్ట్రానికే పరిమితం కావడం లేదు. అదే సమయంలో ఢిల్లీకి అనేక సార్లు వెళ్ళి వస్తున్నారు. కేంద్ర మంత్రులను విరివిగా కలుస్తున్నారు. అలాగే ప్రధాని నరేంద్ర మోడీతో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో కూడా సమావేశం అవుతున్నారు. తాను చురుకైన యువ నేతగా ఏపీ రాజకీయాల్లో ఉన్నాను అని తెలియచేసేందుకు ఈ పర్యటనలు లోకేష్ కి ఎంతగానో దోహదపడుతున్నాయన్న విశ్లేషణలు ఉన్నాయి.

**బీజేపీ ముఖ్యమంత్రులతో :** కేవలం దేశ రాజధాని ఢిల్లీకి మాత్రమే లోకేష్ పర్యటనలు పరిమితం కావడం లేదు, ఆయన వివిధ రాష్ట్రాలలో కూడా పర్యటిస్తున్నారు. రాష్ట్రానికి సంబంధించిన అంశాల మీదనే ఈ పర్యటనలు అని ప్రచారం జరుగుతున్నా వాటితో పాటుగా స్వామి కార్యం అన్నట్లు లోకేష్ ఆయా రాష్ట్రాలలో అధికారంలో ఉన్న నాయకులను ముఖ్యమంత్రులను కలుసుకుంటూ వారితే మమేకం అవుతూ యంగ్ డైనమిక్ లీదర్‌గా తనను తాను ఆవిష్కరించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

**సువేందుతో కీలక భేటీ :** ఇదిలా ఉంటే నారా లోకేష్ తాజాగా పశ్చిమ బెంగాల్ కి వెళ్ళారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సువేందు అధికారితో కోల్ కతాలో భేటీ అయ్యారు. ఇరువురు నేతలు రెండు రాష్ట్రాలకు సంబంధించిన విషయాలను చర్చించుకున్నారు. ఏపీలో అమలు చేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి లోకేష్ సువెందుకు తెలిపారు. ఏపీలో అత్యధిక మందికి సంక్షేమ పధకాలను అమలు చేస్తున్నామని కూడా చెప్పారు. ఆపశ్చిమ బెంగాల్ లో అమలు చేస్తున్న సంక్షేమ పధకాల గురించి కూడా అడిగి తెలుసుకున్నారు. ఏపీ బెంగాల్ మధ్య ఉన్న సాంస్కృతిక బంధాలను మరింత బలోపేతం చేద్దామని సువేందుని లోకేష్ కోరడం విశేషం. ఇదే సందర్భంలో పశ్చిమ బెంగాల్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయ నిర్మాణానికి తగిన స్థలాన్ని కేటాయించాలని, తిరుమలలో పశ్చిమ బెంగాల్ భవన్ నిర్మాణానికి అన్ని విధాలా సాయం అందిస్తామని సువేందుకు లోకేష్ విన్నవించారు.

**మహారాష్ట్ర సీఎంతోనూ :** ఇంతకు ముందు ముంబై పర్యటనకు వెళ్ళిన నారా లోకేష్ మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ తో కూడా భేటీ అయి అనేక అంశాలను ముచ్చటించారు. ఇలా లోకేష్ బీజేపీలో కీలకమైన రాష్ట్రాలకు చెందిన ఇద్దరు యువ ముఖ్యమంత్రులతో భేటీలు వేయడం రాజకీయంగా ఆసక్తిని కలిగించే అంశంగానే చూస్తున్నారు ఈ ఇద్దరు నేతలూ బీజేపీలో ఎంతో భవిష్యత్తు ఉన్న వారు కావడం విశేషం. ఇక ఏపీ నుంచి రాజకీయంగా ఎదుగుతున్న నేతగా లోకేష్ ఉన్నారు. దాంతో ఆయన జాతీయ స్థాయిలో అధికారంలో ఉన్న పార్టీ బీజేపీ పెద్దలతో పాటు యువ ముఖ్యమంత్రులతోనూ అదే రకమైన సాన్నిహిత్యం నెరపడం వెనక ముందు చూపు ఉందని అంటున్నారు. రానున్న రోజులలో ఆయన ఇదే తీరులో మరెంత మంది ముఖ్యమంత్రులను కీలక నేతలను



కలుస్తారు అన్నది కూడా చర్చనీయాంశంగా ఉంది. ఏది ఏమైనా ఏపీకి చెందిన మంత్రిగా ఉన్న లోకేష్ తన పలుకుబడిని జాతీయ స్థాయిలో ఒక క్రమపద్ధతిలో విస్తరించుకుంటున్నారు అన్న మాట అయితే గట్టిగా వినిపిస్తోంది.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## ఇన్‌స్టా ఫేక్ ఐడీతో మోసం



### యువతి నుంచి లక్షలు కాజేసిన నిందితుడు

**టేక్మాల్, విశ్వం వాయిస్ న్యూస్ :** సోషల్ మీడియా వేదికగా పరిచయమై.. ప్రేమ, పెళ్లి పేరుతో నమ్మించి యువతుల వద్ద నుంచి లక్షలాది రూపాయలు, బంగారాన్ని కాజేసిన ఓ మోసగాడి ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్టాగ్రామ్‌లో నకిలీ ఐడీలతో అమ్మాయిలకు వల విసిరి, లక్షల్లో సొమ్ము వసూలు చేసిన ఓ కేటుగాడిపై బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులకు అందిన ఫిర్యాదు వివరాల ప్రకారం... మెదక్ జిల్లా టేక్మాల్ మండలం, ఎల్లంపల్లి గ్రామానికి చెందిన కొండి స్వాతికి ఏడాది క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో రిత్విక్ రెడ్డి అనే ఐడీ నుండి ఫాలో రిక్వెస్ట్ వచ్చింది. దాంతో వారిద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. సదరు వ్యక్తి తాను ఐపీఎస్ ట్రైనింగ్ కోసం ఛత్తీస్‌గడ్ వెళ్తున్నానని.. అది పూర్తి కాగానే పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఆ తర్వాత కొన్ని రోజులకు అర్జెంట్‌గా డబ్బులు కావాలని, తన స్నేహితుడైన ఉప్పరి దుర్గేశ్ వస్తాడని, అతనికి డబ్బులు ఇవ్వాలని ఆమెను నమ్మించాడు. అతని మాటలు నమ్మిన బాధితురాలు విడతల వారీగా నగదు రూపంలో, ఫోన్ పే ద్వారా మొత్తం రూ. 5లక్షలతో పాటు తులం చెవి కమ్మలను దుర్గేశ్‌కి అందజేసింది. డబ్బులు తీసుకున్న తర్వాత సదరు మోసగాడి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఏడాది దాటినా రాకపోవడంతో అనుమానం వచ్చిన స్వాతి తాను మోసపోయానని గ్రహించింది. ఇదే తరహాలో మరెవరినైనా మోసం చేశాడా అని ఆరా తీయగా షాకింగ్ నిజాలు బయటపడ్డాయి. టేక్మాల్ మండలం ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన 17ఏళ్ల యువతికి కూడా ఇన్‌స్టాగ్రామ్‌లో సాత్విక్ రెడ్డి అనే నకిలీ ఐడీ నుండి రిక్వెస్ట్ వచ్చింది. తాను ఎంబీబీఎస్ స్టూడెంట్ అని పరిచయం చేసుకున్న సదరు కేటుగాడు, ఆమెకు డైమండ్ రింగ్ పంపిస్తున్నానని, దానికి టాక్స్ కట్టాలంటూ నమ్మించాడు. తన స్నేహితుడు దుర్గేశ్ వస్తాడని చెప్పి, ఆమె వద్ద నుంచి కూడా రూ. 7లక్షల నగదు, ఒక తులం బంగారు ఉంగరాన్ని దుర్గేశ్ ద్వారా వసూలు చేశాడు. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఉప్పరి దుర్గేశ్ కీలక పాత్రధారి అని తేలింది. అతడే ఇన్‌స్టాగ్రామ్‌లో రిత్విక్ రెడ్డి, సాత్విక్ రెడ్డి వంటి నకిలీ ఐడీలు సృష్టించాడు. తానే పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తున్నట్లుగా నమ్మించి, పెళ్లి పేరుతో ఇద్దరు యువతులను మోసం చేశాడని పోలీసులు గుర్తించారు. ఈ మేరకు టేక్మాల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రకాశం జిల్లాలో నలుగురు, శ్రీకాకుళం జిల్లాలో ముగ్గురు బలవన్మరణం

**విశ్వం వాయిస్ న్యూస్ :** క్షణికావేశంలో కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. కుటుంబ కలహాలతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. తల్లిదండ్రులతో పాటు ముక్కుపచ్చలారని చిన్నారులను కూడా చిదిమేస్తున్నారు.

**ప్రకాశం జిల్లాలో నలుగురు**


చీమకుర్తి మండలం అగ్రహారం గ్రామంలో దారుణం జరిగింది. ఎకుల సుధాకర్ (35) తన ముగ్గురు పిల్లలను చంపేసి.. ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య కాపురానికి రావడం లేదని తీవ్ర మనస్తాపానికి గురైన సుధాకర్ తన కుమార్తెలు గోచిత (13), పూజిత (11), లోకిత శ్రీ(8)కి విషమిచ్చాడు. ముగ్గురూ చనిపోయిన తర్వాత గ్రామ శివారులోని పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**శ్రీకాకుళం జిల్లాలో మరో దారుణం..**

ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడింది. ఏం కష్టమొచ్చిందో ఏమో.. ఇవాళ తెల్లవారుజామున పలాస–తాళభద్ర మధ్య రైలు పట్టాలపై ముగ్గురి మృతదేహాలను స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నా చావుకు కారణం.. కృష్ణలంక సీఐ నాగరాజు

### ఆత్మహత్యకు ముందు సెల్ఫీవీడియో తీసుకున్న సస్పెక్ట్ షీటర్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయవాడ లబ్బీపేట ప్రాంతానికి ఓ సస్పెక్ట్ షీటర్ పేరుపోగు క్రాంతికుమార్ (40) గత నెల 21న విషగుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొంది, ఒక రోజు తర్వాత 22న చనిపోయాడు. అతను చనిపోయేముందు ఓ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఆ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. తనను కృష్ణలంక సీఐ నాగరాజు తీవ్రంగా వేధిస్తున్నట్టు ఆ వీడియోలో బాధితుడు వాపోయాడు. 'నా చావుకు కారణం సీఐ నాగరాజు. నన్ను వేటాడి వెంటాడి, వేధిస్తున్నారు. మూడు నెలల నుంచి కొడుతూనే ఉన్నారు. నేనింక బతకలేను. నా చావుకు కారణం ఆయనే. అందుకే గుళికల మందు తాగేస్తున్నా' అని చెప్పి తన చేతిలో ఉన్న పౌడర్ మింగుతూ వీడియో తీసుకున్నాడు. అతనిని కుటుంబసభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ.. మర్నాడు చనిపోయాడు.

సస్పెండైన కృష్ణలంక

## సీఐ నాగరాజుపై కేసు నమోదు




**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** సస్పెండైన కృష్ణలంక సీఐ నాగరాజుపై కేసు నమోదైంది. గాదె సాయి కృష్ణ తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు..127 (4), 127(6), 103(1), 238 బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. సాయికృష్ణ అదృశ్యంపై దర్యాప్తు అధికారిగా నియమితులైన రాజమహేంద్రవరం ఎస్పీ నరసింహ కిశోర్.. శుక్రవారం విజయవాడ రానున్నారు. ఆయన తొలుత డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, విజయవాడ సీపీ రాజశేఖర బాబులను కలవనున్నారు. వారితో చర్చించాక కృష్ణలంక స్టేషన్‌కు వెళ్లనున్నట్లు తెలిసింది.

## తెదేపా కార్యకర్తపై హత్యాయత్నం

### నలుగురు వైకాపా కార్యకర్తల అరెస్ట్

**కర్నూలు, విశ్వం వాయిస్ న్యూస్ :** కర్నూలులో తెదేపా కార్యకర్త తైజుమ్ బాషాపై హత్యాయత్నం కేసులో నలుగురు వైకాపా కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. వైకాపా నేత ఎస్వీ మోహన్‌రెడ్డి అనుచరులుగా ఉన్న ఆ పార్టీ కార్యకర్తలు జలీల్, జునైత్, ఫైజల్, ఆరిఫ్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అరెస్ట్ అనంతరం నిందితులను వన్‌టౌన్ పీఎస్ నుంచి కొండారెడ్డి బురుజు వరకు పోలీసులు నడిపించుకుంటూ తీసుకెళ్లారు. ఇటీవల తైజుమ్ బాషాపై నిందితులు విచక్షణారహితంగా కర్రలు, రాళ్లతో దాడి చేసి హత్య చేసేందుకు యత్నించారు. బాషా తన ఇంటి నుంచి కిరాణా దుకాణానికి వెళ్లి తిరిగి వస్తుండగా మాటు వేసిన వైకాపా కార్యకర్తలు.. అతడిపై తీవ్రస్థాయిలో దాడి చేశారు. తీవ్ర గాయాలతో ఉన్న బాషాను కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనపై కర్నూలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓట్ల సవరణ కార్యక్రమంలో వైకాపా తప్పులు కనిపెడుతున్నారని, తెదేపాలో యాక్టివ్‌గా ఉన్నాడనే కారణంతో బాషాపై నిందితులు దాడి చేసినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. నిందితులను అరెస్ట్ చేశారు.

## ఒరిగిన స్తంభం... చర్యలు వద్దంటే లంచం

### రూ.25 వేలు తీసుకుంటూ అనిశాకు చిక్కిన విద్యుత్ ఏఈ



**జిన్నారం, విశ్వం వాయిస్ న్యూస్ :** రూ. 25 వేల లంచం తీసుకుంటూ ట్రాన్స్‌కో ఏఈ బి.రామకృష్ణారెడ్డి గురువారం అనిశాకు పట్టుబడ్డారు. అనిశా మెదక్ రేంజి డీఎస్పీ సుదర్శన్ ఐడీఏ బొల్లారంలో తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 12న సంగారెడ్డి జిల్లా ఐడీఏ బొల్లారంలోని వై.ఎస్.ఆర్.కాలనీలో జరిగిన కారు ప్రమాదంలో విద్యుత్తు స్తంభం ఒరిగింది. ఈ ఘటనలో ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉండేందుకు ఏఈ రూ. 50 వేలు డిమాండ్ చేశారు. రూ. 25 వేలకు ఒప్పందం కుదుర్చుకున్న బాధితుడు అనిశాకు సమాచారం ఇచ్చారు. గురువారం కార్యాలయం సమీపంలో డబ్బులు తీసుకుంటుండగా.. ఏఈని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరు పరుస్తామని డీఎస్పీ వెల్లడించారు.

## ఛత్తీస్‌గఢ్‌లో భాజపా నేత సజీవదహనం

**రాయ్‌పుర్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇసుక తవ్వకం వ్యవహారంలో వివాదాల కారణంగా ఓ భాజపా నేత సజీవదహనమైన సంఘటన ఛత్తీస్‌గఢ్‌లోని కొరియా జిల్లాలో జరిగింది. ఈ దుర్ఘటనలో భాజపా నేత భరత్ సింగ్ (60) తోపాటు ఆయన బంధువులు ఇద్దరు కాలి బూడిదయ్యారు. భరత్ సింగ్ ప్రత్యర్థి వర్గంతో మాట్లాడేందుకు కాట్గోడి గ్రామానికి వెళ్లారని, అక్కడ తీవ్ర వాగ్వివాదం జరిగిందని పోలీసులు తెలిపారు. అనంతరం అక్కడి నుంచి భాజపా నేత కారులో తిరిగి వస్తుండగా దుండగులు ఆ వాహనాన్ని ట్రక్కుతో ఢీకొట్టి... కారుకు నిప్పంటించారన్నారు. బాధితులపై ఇంధనం పోసి తగులబెట్టారని ప్రాథమికంగా తెలుస్తోందని ఫోరెన్సిక్ నిపుణులు పేర్కొన్నట్లు సీనియర్ పోలీసు అధికారి ఒకరు చెప్పారు. ఈ కేసులో ఒకే కుటుంబానికి చెందిన నలుగురిని అరెస్టు చేసినట్టు వెల్లడించారు.

# తక్కువ తింటున్నా బరువు పెరుగుతున్నారా?

## హెల్త్ వాయిస్ — డాక్టర్లు చెబుతున్న షాకింగ్ నిజాలు ఇవే!

ఈ రోజుల్లో బరువు తగ్గడం కోసం చాలా మంది డైటింగ్ చేస్తుంటారు, తక్కువ ఆహారం తీసుకుంటుంటారు. అయినప్పటికీ, బరువు తగ్గకపోగా మరికొంత బరువు పెరుగుతుంటారు. నేను అంతగా తినడం లేదు, అయినా ఎందుకు లావు అవుతున్నాను? అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. అయితే, బరువు పెరగడానికి కేవలం మనం తినే ఆహారమే కాకుండా.. మన శరీరంలో జరిగే కొన్ని అంతర్గత మార్పులు, జీవనశైలి లోపాలు కూడా ప్రధాన కారణాలని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అవేంటో ఇప్పుడు వివరంగా చూద్దాం. చాలా మంది తాము తక్కువ తింటున్నా బరువు పెరుగుతున్నామని ఆందోళన చెందుతుంటారు. కేవలం క్యాలరీలు, ఆహారం మాత్రమే కాకుండా మరికొన్ని ముఖ్యమైన జీవనశైలి కారకాలు బరువు పెరగడానికి కారణమవుతాయని వైద్యులు చెబుతున్నారు. అవేంటో ఇప్పుడు చూద్దాం..



**మానసిక ఒత్తిడి:** నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడి సర్వసాధారణం అయిపోయింది. మనం తీవ్రమైన ఒత్తిడికి గురైనప్పుడు శరీరంలో కార్టిసోల్ అనే హార్మోన్ విడుదలవుతుంది. దీనిని స్ట్రెస్ హార్మోన్ అంటారు. ఇది శరీరంలో మెటబాలిజాన్ని (జీవక్రియను) మందగింపజేస్తుంది. అంతేకాకుండా, పొత్తికడుపు భాగంలో కొవ్వు పేరుకుపోయేలా చేస్తుంది. ఒత్తిడి వల్ల హై-క్యాలరీ, షుగర్ ఉన్న ఆహారాలు తినాలనే కోరిక కూడా పెరుగుతుంది.

**నిద్రలేమి :** రాత్రి పూట సరిగ్గా నిద్రపోకపోవడం బరువు పెరగడానికి దారితీస్తుంది. నిద్ర తక్కువైనప్పుడు ఆకలిని నియంత్రించే లెప్టిన్, గ్రెలిన్ అనే హార్మోన్ల సమతుల్యత దెబ్బతింటుంది. లెప్టిన్ మనకు కడుపు నిండిన అనుభూతిని ఇస్తే, గ్రెలిన్ ఆకలిని పెంచుతుంది. నిద్ర లేకపోవడం వల్ల గ్రెలిన్ పెరిగి, లెప్టిన్ తగ్గుతుంది. ఫలితంగా మరుసటి రోజు ఎక్కువ ఆహారం, ముఖ్యంగా జంక్ ఫుడ్ తినాలనిపిస్తుంది.

**హార్మోన్ల అసమతుల్యత :**

శరీరంలో హార్మోన్లు సరిగ్గా పనిచేయనప్పుడు కూడా బరువు అదుపు తప్పుతుంది. ముఖ్యంగా:

**హైపోథైరాయిడిజం :** థైరాయిడ్ గ్రంధి తగినంత హార్మోన్‌ను ఉత్పత్తి చేయనప్పుడు మెటబాలిజం పూర్తిగా పడిపోయి బరువు పెరుగుతారు.


**ఇన్సులిన్ రెసిస్టెన్స్ :** కణాలు ఇన్సులిన్‌కు సరిగ్గా స్పందించనప్పుడు, రక్తంలోని గ్లూకోజ్ కొవ్వుగా మారి శరీరంలో పేరుకుపోతుంది.

**పిసిఒడి :** మహిళల్లో ఈ సమస్య ఉన్నప్పుడు హార్మోన్ల హెచ్చుతగ్గుల వల్ల బరువు వేగంగా పెరుగుతారు.

బరువు తగ్గాలంటే కేవలం తక్కువ తినడం మాత్రమే సరిపోదు. రోజుకు కనీసం 7 నుండి 8 గంటల ప్రశాంతమైన నిద్రపోవడం, యోగా లేదా ధ్యానం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవడం ఎంతో ముఖ్యం. ఒకవేళ జీవనశైలి బాగున్నా బరువు పెరుగుతుంటే.. ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించి హార్మోన్ల పరీక్షలు చేయించుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి

డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

శనివారం, 20 జూన్, 2026

www.viswamvoice.com




## గత ప్రభుత్వంలో దోచుకో దాచుకో తప్పిస్తే అభివృద్ధి శూన్యం

### అభివృద్ధి సంక్షేమాన్ని గాడిలో పెట్టిన ఘనత కూటమి ప్రభుత్వానిది
### రెండేళ్ల కూటమి ప్రభుత్వ విజయోత్సవ సభలో ఎమ్మెల్యే వేగుళ్ల





**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** వైసిపి ప్రభుత్వ దోచుకో దాచుకో విధ్వంస పాలన నుండి కూటమి వికాసం వైపుకు అడుగులు వేస్తూ ప్రజలకు అభివృద్ధి సంక్షేమ ప్రభుత్వాన్ని అందజేసిందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు. మండపేట సూర్య ఫంక్షన్ హాల్లో శుక్రవారం మండపేట నియోజకవర్గం రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుండి వేలాదిగా కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు తరలివచ్చారు. సూర్య కన్వర్షన్ హాల్ పూర్తిగా జనంతో నిండిపోయింది. ఫంక్షన్ హాల్ బయట కూడా కార్యకర్తల అభిమానులు నిలబడి సభ అయ్యేంతవరకు వేచి ఉన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ భారీ ఎత్తున కార్యకర్తలు రావడం విశేషం. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిలు గా ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, జనసేన ఇంచార్జ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ల లీలా కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ వివివి చౌదరి కూర్మాపురం అబ్బు, బిజెపి సీనియర్ నాయకులు కోన సత్యనారాయణ, కోటిపల్లి సాయిరాం, గొడవర్తి రామచంద్రరావు లు విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రాన్ని దోచుకోవడం దాచుకోవడం తప్పిస్తే చేసిందేమీ లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సారధ్యంలో రాష్ట్రం పురోభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. దివాలా తీసే స్థితికి రాష్ట్రాన్ని జగన్ తీసుకువచ్చారని విమర్శించారు. సాక్షి పత్రిక టీవీల ద్వారా అసత్య ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. రెండేళ్లు వెన్నుపోటు కార్యక్రమం నిర్వహిస్తున్నారని వారిదే వెన్నుపోటుని విమర్శించారు. చిన్నాన్నను గొడ్డలిపోటుతో హతమార్చిన ఘనత వారిదేనన్నారు. తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పింక్ డైమండ్ ను చంద్రబాబు తన తనయుడు లోకేష్ కి ఇచ్చారని దుష్ప్రచారం చేశారన్నారు. అలాగే మెగా డీఎస్సీ లో మెగా మోసం జరిగిందని వదంతులు వ్యాపింప చేస్తున్నారన్నారు. దీనికి కారణం జగన్ పిఎ కే ఎన్ ఆర్ పై ఇటీవల కేసులు నమోదు కావడంతో ఆ అంశాన్ని పక్కదోవ పట్టించడం కోసం డ్రామాలాడుతున్నారని విమర్శించారు. మండపేట నియోజవర్గంలో కపిలేశ్వరపురం మండలంలో టిడిపికి సంబంధంలేని ముగ్గురు వ్యక్తులు వైసీపీలో చేరారని వీరు టీడీపీ అని దుష్ప్రచారం చేశారన్నారు. ఇలా అన్ని విషయాలను వైసీపీ నాయకులు తమకు అనుకూలమైన మీడియాతో దుష్ప్రచారాన్ని చేస్తున్నాయని ప్రజలు వీటిని నమ్మే పరిస్థితి వచ్చిందన్నారు. ఎక్కడికి అక్కడ ఈ విమర్శలను తిప్పి కొట్టాలని కార్యకర్తలను కోరారు. టిడిపి బిజెపి జనసేన ఐకమత్యంగా ఉండి వచ్చే వచ్చే స్థానిక ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం పొందాలని ఆకాంక్షించారు. కూటమి సాధించిన విజయాలను వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో రాష్ట్రం లో అభివృద్ధి సాధ్యమైందన్నారు. సూపర్ సిక్స్ లో ఐదు హామీలు అమలు చేశారని తెలిపారు. వచ్చే మూడేళ్ల కాలంలో రాష్ట్రంలో అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించి ప్రజలకు మేలు చేస్తామని చెప్పారు. మండపేట జనసేన ఇన్చార్జ్ రాష్ట్ర నీటిపారుదల సంస్థ చైర్మన్ వేగుళ్ల లీలా కృష్ణ మాట్లాడుతూ మండపేట నియోజవర్గంలో వలస వచ్చిన దుష్ట నాయకత్వం కుట్రలు పన్నుతుందని ధ్వజమెత్తారు. ఆయన స్వగ్రామంలో వైసిపి కాపుల సమావేశం నిర్వహిస్తున్నారని దీంట్లో తప్పేమీ లేదని కాగా కూటమి ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ కుట్ర పన్నడం పై ఆయన తప్పు పట్టారు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు కాపుల కోసం చేసుకున్న అభివృద్ధిని వివరించారు. గతంలో కాపులకు చంద్రబాబు ఐదు శాతం రిజర్వేషన్లు కల్పిస్తే జగన్ వాటిని రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కాపులకు న్యాయం చేసేది కేవలం కూటమి మాత్రమేనని పేర్కొన్నారు. తమ నాయకుడి పై బురదజల్లేందుకు వైసిపి లోని కాపు నేతలను ఒక చోటకు చేర్చి ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చేందుకు వలస దుష్ట నాయకుడు కుట్ర పన్నుతున్నాడని సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ కనుసన్నల్లోనే ఆయన డైరెక్షన్లో ఈ కాపు సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. కుట్రలు సాగనివ్వమని ఆయన పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ వివివి చౌదరి మాట్లాడుతూ ఏపీ అంటే అమరావతి పోలవరం అని పేర్కొన్నారు. 2027 నాటికి పోలవరం పూర్తవుతుందన్నారు. అమరావతిలో పనులు వేగవంతంగా చేపడుతున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు వేగుళ్ళ అజయ్ బాబు, రెడ్డి ప్రసాద్, టిడిపి నాయకులు నల్లమిల్లి వీర్రెడ్డి , మల్లి పూడి గణేష్ , తుమ్మల సునీత అన్నవరం దేవస్థానం డైరెక్టర్ యరగతపు బాబ్జి, చింతపల్లి రామకృష్ణ, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి చంద్రశేఖర్, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి, కొప్పిశెట్టి మాధవరావు, కర్రి తాతారావు, మచ్చ నాగబాబు, కాసిన కాశీ విశ్వనాథం, ఉంగరాల రాంబాబు, వాదా ప్రసాదరావు, జనసేన నాయకులు మేక సూరిబాబు, నామాలు చందర్రావు, కుంచే దుర్గాప్రసాద్,నియోజకవర్గం నలుమూల నుండి టిడిపి నాయకులు అభిమానులు కార్యకర్తలు అభిమానులు, మాజీ కౌన్సిలర్ లు మాజీ సర్పంచ్ లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 21న ఆర్క హాస్పటిల్స్ & ఎమర్జెన్సీ కేర్ ప్రారంభం

**రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ రాక**

**హాజరుకానున్న మంత్రి దుర్గేష్, ఎంపీ, ఎమ్మెల్యేలు, ప్రముఖులు**

**అన్ని రకాల వైద్య విభాగాలు, 200పడకల సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్**


**పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో వైద్యం -ఆర్క చైర్మన్ డాక్టర్ మొల్లేటి రామ్మోహన్ వెల్లడి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** లాలాచెరువు హౌసింగ్ బోర్డు ఎదురుగా 'ఆర్క హాస్పటిల్స్ అండ్ ఎమర్జెన్సీ కేర్' సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్ ఈనెల 21వ తేదీ ఆదివారం సాయంత్రం ప్రారంభిస్తున్నట్లు హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ మొల్లేటి రామ్మోహన్ చెప్పారు.రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతులమీదుగా హాస్పిటల్ ప్రారంభం కానుందని తెలిపారు. ఆర్క లో శుక్రవారం సాయంత్రం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో డాక్టర్ రామ్మోహన్ మాట్లాడుతూ గడిచిన పాతికేళ్ళుగా అనురాగ్ చెస్ట్ కేర్ హాస్పిటల్ ద్వారా వైద్య సేవలందిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు అన్ని విభాగాల అత్యాధునిక వైద్య సేవలతో 200పడకలతో సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్‌గా 'ఆర్క హాస్పటిల్స్ అండ్ ఎమర్జెన్సీ కేర్' ను తీర్చిదిద్దినట్లు ఆయన చెప్పారు. కోవిడ్ సమయంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని రాజమండ్రిలో కూడా అన్ని వసతులు, సదుపాయాలతో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకు రావాలన్న ఉద్దేశ్యంతో ఆర్క హాస్పటిల్స్ అండ్ ఎమర్జెన్సీ కేర్ ఏర్పాటుచేసినట్లు డాక్టర్ రామ్మోహన్ చెప్పారు. కోవిడ్ లో ప్రయివేటు హాస్పిటల్స్ పరంగా తానే అందరికంటే ముందుగా వైద్యం అందించి దాదాపు 25వేలమందికి కోవిడ్ చికిత్స అందించినట్లు తెలిపారు. తానుకూడా కోవిడ్ బారిన పడడంతో హైదరాబాద్ వెళ్లి లక్షలు వెచ్చించి వైద్యం చేయించుకున్నానని ఆయన గుర్తుచేశారు. దాంతో ఇక్కడ కూడా అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండాలని భావించి పేద మధ్య తరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో వైద్య సేవలు అందించడానికి ఆర్క హాస్పటిల్స్ అండ్ ఎమర్జెన్సీ కేర్ ఏర్పాటుచేసినట్లు డాక్టర్ రామ్మోహన్ వివరించారు. పల్మనాలజీ, కార్డియాలజీ , యూరాలజీ, న్యూరాలజి, పిడియాట్రిక్, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, నెఫ్రాలజీ ఈ ఎన్ టి, కంటి వైద్యం ఇలా అన్ని విభాగాలను ఇక్కడ ఏర్పాటుచేస్తున్నట్లు డాక్టర్ రామ్మోహన్ చెప్పారు. సిటీ స్కాన్, ఎం ఆర్ ఐ, అల్ట్రా సౌండ్, కేతలాబ్ ఇలా అన్ని రకాల వైద్య పరీక్షలు ఇక్కడే చేయడానికి ఏర్పాట్లు చేశామన్నారు. 200పడకలతో కూడిన ఈ హాస్పిటల్ లో 50పడకలు ఐసియు, ఎస్ ఐ సియూ, ఎన్ ఐ సియూ, ఐసిసియు, లకు కేటాయించినట్లు ఆయన వివరించారు. 100మంది కూర్చునేందుకు వీలుగా కాంటీన్ కూడా ఏర్పాటుచేసినట్లు ఆయన తెలిపారు. 'ఆర్క హాస్పటిల్స్ అండ్ ఎమర్జెన్సీ కేర్' అందరికీ అందుబాటు ధరల్లో వైద్యం అందిస్తుందని తెలిపారు. అనురాగ్ చెస్ట్ కేర్ లో వైద్య సేవలు నిలిపివేసి 'ఆర్క హాస్పటిల్స్ అండ్ ఎమర్జెన్సీ కేర్' లోనే సేవలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ హెచ్ ఎస్, ఎన్టీఆర్ వైద్య సేవ ,అన్ని రకాల ఇన్స్యూరెన్స్ లు ఇక్కడ అందుబాటులోకి తెస్తామని డాక్టర్ రామ్మోహన్ చెప్పారు. మంత్రి సత్యకుమార్‌తో పాటు రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామ కృష్ణ , అధికారులు ప్రముఖులు హాజరవుతారని డాక్టర్ రామ్మోహన్ చెప్పారు.

## ఆంధ్రప్రదేశ్‌లో విద్యా రంగంలో భారీ దోపిడీ జరుగుతోంది

### ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యా రంగం లక్షల కోట్ల రూపాయల అవినీతి వ్యాపారంగా మారిందని, ప్రైవేట్ విద్యాసంస్థల పేరుతో విద్యను పూర్తిగా వ్యాపార వస్తువుగా మార్చేశారని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు తీవ్ర ఆరోపణలు చేశారు. గురువారం అమలాపురంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం విద్యను అందించేందుకు తీసుకున్న నిర్ణయాన్ని అడ్డుకునేందుకు అప్పటి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు హైకోర్టులో స్టే తెచ్చుకున్నారని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్ర విద్యా వ్యవస్థను కొద్దిమంది ప్రైవేట్ విద్యా సంస్థల చేతుల్లో పెట్టి, విద్యను లాభదాయక వ్యాపారంగా మార్చారని ఆరోపించారు. విద్యా రంగంలో పారదర్శకత లేకపోవడం వల్ల తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక భారం మోస్తున్నారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా క్రోనీ కాపిటలిజం పెరిగిపోయిందని, పార్లమెంట్ నుంచి విద్యా వ్యవస్థ వరకు కార్పొరేట్ శక్తుల ఆధిపత్యం పెరుగుతోందని ఆయన అన్నారు. విద్యా రంగంలో జరుగుతున్న వ్యాపారం అంబానీ, అదానీ సంస్థల వ్యాపారాల కంటే పెద్ద స్థాయిలో ఉందని వ్యాఖ్యానించారు. విద్యా రంగంలో జరుగుతున్న దోపిడీపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉద్యమానికి సిద్ధంగా ఉందని, ప్రైవేట్ పాఠశాలలు మరియు విద్యాసంస్థల యాజమాన్యాలపై రాష్ట్రవ్యాప్తంగా పోరాట కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. తమిళనాడు ప్రభుత్వం విద్యా హక్కు చట్టం అమలులో ఆదర్శంగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. అక్కడ ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీజులు, యూనిఫాం, బస్సు ఛార్జీలు, పుస్తకాల ధరలు తదితర వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత, బాధ్యతాయుత విధానాలు అమలు చేస్తున్న రాష్ట్రంగా తమిళనాడు నిలిచిందని అభిప్రాయపడ్డారు. అయితే ఆంధ్రప్రదేశ్‌లో విద్యా రంగం దళారుల చేతుల్లో పడిపోయిందని, అమలాపురం, కోనసీమ ప్రాంతాల్లోనే వేల కోట్ల రూపాయల విద్యా వ్యాపారం జరుగుతోందని ఆరోపించారు. తల్లిదండ్రుల హక్కులు, విద్యార్థుల ప్రయోజనాలు, విద్యా రంగంలో పారదర్శకతను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నప్పటికీ, ప్రస్తుతం ప్రభుత్వం ఆ బాధ్యతను విస్మరించిందని విమర్శించారు. విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతర పోరాటం కొనసాగిస్తుందని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు స్పష్టం చేశారు.


## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు





**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురంలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అగ్రనేత రాహుల్ గాంధీ 56వ జన్మదిన వేడుకలను శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల ప్రారంభంలో భాగంగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాహుల్ గాంధీ జన్మదిన కేక్‌ను కట్ చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఒకరికొకరు మిఠాయిలు పంచుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కేక్ కటింగ్ కార్యక్రమం ముగిసిన తర్వాత పార్టీ శ్రేణులు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి చేరుకున్నారు. అక్కడ చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి వారికి పాలు, రొట్టెలు మరియు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోట శ్రీనివాసరావు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా సామాన్యుల పక్షాన నిలబడి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న జననేత రాహుల్ గాంధీ అని పేర్కొన్నారు. ఆయన అంకితభావం యువతకు ఆదర్శమని భవిష్యత్తులో దేశ బాధ్యతలు చేపట్టి ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రజా సేవలో భాగస్వాములు కావాలనే రాహుల్ గాంధీ పిలుపు మేరకు, ఆసుపత్రిలో రోగులకు నిత్యావసరాలను అందజేసి ధైర్యం చెప్పినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమలాపురంలో ఘనంగా కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవ సభ

### ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** "రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" నినాదంతో ప్రజాపాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజల్లో పూర్తి సంతృప్తి ఉందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమలు, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం అమలాపురం లోని కాపు కళ్యాణ మండపంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా స్థాయి విజయోత్సవ సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ మహిళల హక్కుల పరిరక్షణ, పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వానికి లభించిన అధికారం తమ బాధ్యతను మరింత పెంచిందని, రెండేళ్ల నమ్మకాన్ని రాబోయే మూడేళ్లలో సర్వతోముఖ అభివృద్ధిగా మలచాలని పిలుపునిచ్చారు. ప్రజల మన్ననలే తమకు శ్రీరామరక్ష అని, ప్రజా మద్దతును మరింత కూడగట్టి కూటమిని బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కూటమి నాయకత్వంలో పారదర్శక పాలనకు రెండేళ్లు పూర్తయ్యాయని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిర్వహిస్తున్న విజయోత్సవాల్లో భాగంగా అమలాపురంలో ఈ సభ నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్యకర్తలు చేసిన కృషికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిపాలనా దక్షత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ త్యాగం, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ప్రజా జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పెంపు, దీపం-2, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. సూపర్ సిక్స్ హామీలను దశలవారీగా అమలు చేయడంతో ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందన్నారు. గోదావరి డెల్టా ఆధునీకరణపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని, త్వరలోనే ఆ పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో సంక్షేమానికి భారీగా నిధులు వెచ్చిస్తున్నామని, ఆక్వా రంగానికి యూనిట్‌కు రూ. 1.50కే రాయితీ విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో వృద్ధులు, వితంతువులకు కొత్త పెన్షన్లు మంజూరు చేయడంతో పాటు పేదలకు పెద్ద ఎత్తున గృహనిర్మాణాలు చేపట్టనున్నట్లు చెప్పారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీ ద్వారా 16,364 పోస్టులను పారదర్శకంగా భర్తీ చేశామని తెలిపారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, రాబోయే మూడేళ్లలో రాష్ట్రాన్ని సర్వతోముఖ అభివృద్ధి వైపు నడిపించేందుకు అందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశ ప్రతిష్ఠ అంతర్జాతీయ స్థాయిలో మరింత పెరిగిందన్నారు. రెండేళ్ల నమ్మకాన్ని రాబోయే మూడేళ్లలో జిల్లాను సువర్ణ జిల్లాగా మార్చే దిశగా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల ద్వారా అర్హులైన రైతు కుటుంబాలకు సంవత్సరానికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందుతోందన్నారు. వేట విరామ సమయంలో మత్స్యకారులకు రూ.20 వేల భృతి అందిస్తున్నామని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ, చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తోందన్నారు. రైతుల సంక్షేమం కోసం ధరల స్థిరీకరణ నిధి ద్వారా అదనపు సహాయం అందిస్తున్నామని, ఖరీఫ్ సాగుకు అవసరమైన ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతులు మోసపోకుండా ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. అంతకుముందు సభా ప్రాంగణానికి చేరుకున్న మంత్రి అచ్చెన్నాయుడికి కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లను సందర్శించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పరిధిలో శ్రీనిధి, బ్యాంకు లింకేజీ, ఉన్నతి పథకాల కింద రూ.5,301.40 కోట్ల విలువైన చెక్కును మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియా దేవి, ఎమ్మెల్యేలు దేవ వరప్రసాద్, గిడ్డి సత్యనారాయణ, బండారు సత్యానందరావు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అమలాపురం అభివృద్ధికి మరో మైలురాయి

## ఈదరపల్లి, నడిపూడి వంతెనలను ప్రారంభించిన మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయి. నియోజకవర్గ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఈదరపల్లి వంతెన, నడిపూడి వంతెనలు శుక్రవారం ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కలిసి ఈ వంతెనలను ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మౌలిక సదుపాయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. అమలాపురం నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ఆనందరావు నిరంతరం కృషి చేస్తున్నారని, ఆయన ప్రత్యేక చొరవ వల్లే ఈ కీలక వంతెనల నిర్మాణం వేగంగా పూర్తై ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. ఈ వంతెనలు కోనసీమ ప్రాంత రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు రైతులు, విద్యార్థులు, వ్యాపారులకు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ అమలాపురం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈదరపల్లి, నడిపూడి ప్రాంతాల ప్రజలు వంతెనల లేమితో ఎన్నో సంవత్సరాలుగా పడుతున్న ఇబ్బందులను దగ్గరగా గమనించానని, ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపగలగడం సంతోషంగా ఉందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. నియోజకవర్గంలో రహదారులు, వంతెనలు, తాగునీరు, విద్య, వైద్య రంగాలకు సంబంధించిన మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి అమలాపురం రూపురేఖలను మార్చేందుకు కృషి చేస్తానని ఆనందరావు వెల్లడించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిధులు తీసుకువచ్చి మరిన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కట్టుబడి ఉన్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వంతెనల ప్రారంభంతో ఈదరపల్లి, నడిపూడి ప్రాంతాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఎన్నో ఏళ్ల కల నెరవేరడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే ఆనందరావు చేసిన కృషిని అభినందించారు.

### ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు


# ప్రోత్సాహక బహుమతులు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** 2025-26 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల యందు అత్యున్నత ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు పూర్వ విద్యార్థి యర్రప్రగడ సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం వారి కుమారులు వెంకటరమణ, రాజశేఖరం అందించే ప్రోత్సాహక బహుమతులు వారి బంధువులు సుబ్బలక్ష్మి అరుణ్ కుమారి బాలుర ప్రభుత్వ పాఠశాల విద్యార్థి దార్ల యశ్వంత్ సాయి, బాలికల ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని బండారు జోషిక లకు ఒక్కొక్కరికి 25వేల రూపాయలు చొప్పున మొత్తం 50 వేల రూపాయలు బహుమతిగా అందజేయడం జరిగింది. వారి కుమారులు అందించే ప్రోత్సాహక బహుమతులు తండ్రి జ్ఞాపకార్థం మాత్రమే కాకుండా సహజంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పేద విద్యార్థులై ఉంటారు కాబట్టి వారికి ప్రోత్సాహక బహుమతులు అందించి స్ఫూర్తినివ్వడమే కాకుండా ఆర్థిక చేయూతగా ఉపయోగపడి ఉన్నతమైన చదువులకు, ఉన్నతమైన ఉద్యోగమును పొందడానికి ఎంతో ఉపయోగ పడుతుంది. వారు మంచి సేవాతత్వంతో దానగుణంతో ఈ కార్యక్రమాన్ని 2010 నుంచి ఇప్పటివరకు కొనసాగించడం సమాజంలో ఎంతో మందికి స్ఫూర్తిదాయకం ఇటువంటి మంచి కార్యక్రమాలలో వారిని స్ఫూర్తిగా తీసుకొని స్వచ్ఛందంగా ప్రజలు పాల్గొన్నట్లయితే పేదరిక నిర్మూలన, విద్యార్థులకు ఉన్నత విద్య ,వారి యొక్క ఆర్థిక స్థితిగతులు మెరుగుపడటమే కాకుండా, భావితరాలకు మేలు చేసినటువంటి వారవుతాము ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఏ. ఉషారాణి, బాలికల పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఎన్. సత్యనారాయణ ,విశ్రాంత ఉపాధ్యాయులు జయంతి వెంకట సోమయాజులు, మండల విద్యాశాఖ అధికారులు ఎం. హరి ప్రసాద్, కే.లీలావతి బాలుర ఉన్నత పాఠశాల కో-ఆప్షన్స్ సభ్యులు చోడపనీడి భాస్కరరావు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# అమలాపురం విద్యా రంగానికి మహర్దశ

### పేరూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శంకుస్థాపన



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం నియోజకవర్గ విద్యా రంగ చరిత్రలో శుక్రవారం ఒక కీలక మైలురాయిగా నిలిచింది. నియోజకవర్గ విద్యార్థుల దశాబ్దాల కలను సాకారం చేస్తూ అమలాపురం రూరల్ మండలం పేరూరు గ్రామంలో నూతన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుతో కలిసి ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం ఎమ్మెల్యే ఆనందరావు ప్రత్యేక చొరవ తీసుకుని నిధుల మంజూరుకు కృషి చేశారని అభినందించారు. ఆధునిక వసతులతో కళాశాల భవనాన్ని నిర్మించి త్వరలోనే విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ పేరూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు తన కలల ప్రాజెక్ట్ అని, దానికి శుక్రవారం శంకుస్థాపన జరగడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు, ముఖ్యంగా విద్యార్థినులు ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఇకపై ఉండదన్నారు. స్థానికంగానే నాణ్యమైన ఉన్నత విద్య అందుబాటులోకి రావడం వల్ల వేలాది మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. కళాశాల నిర్మాణానికి అవసరమైన అనుమతులు, నిధుల మంజూరులో సహకరించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, అమలాపురాన్ని అభివృద్ధి పరంగా మాత్రమే కాకుండా విద్యా రంగంలోనూ అగ్రస్థానంలో నిలపడానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆనందరావు స్పష్టం చేశారు. అమలాపురం నియోజకవర్గ భవిష్యత్ తరాలకు ఉన్నత విద్యా అవకాశాలు కల్పించే ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ద్వారా విద్యార్థుల విద్యాభివృద్ధికి కొత్త దారులు తెరుచుకోనున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, కూటమి నాయకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పేరూరు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

### హెల్మెట్ ధరించడం

# ప్రాథమిక బాధ్యత

### రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్ విద్యాసాగర్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆలమూరు, రహదారి భద్రత అనేది కేవలం నిబంధనల అమలు కాదని, అది ప్రతి పౌరుడి ప్రాథమిక బాధ్యతని రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్ విద్యాసాగర్ అన్నారు. ఆలమూరు మండలం జొన్నాడ సెంటర్ వద్ద ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ పై ఆలమూరు పోలీసులతో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ విద్యాసాగర్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోవడం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, అతివేగం, సెల్ ఫోన్ డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలు ఏటా రెట్టింపు అవుతూ ఎన్నో కుటుంబాలను తీరని శోకంలోకి నెడుతున్నాయని అన్నారు. ఇంటికి పెద్దదిక్కును కోల్పోతే ఆ కుటుంబం పడే వేదన, ఆర్థిక ఇబ్బందులు వర్ణనాతీతమని ఇది ప్రతి ఒక్కరూ గమనించాలని హెచ్చరించారు. క్షతగాత్రుల పరిస్థితి మరీ ఘోరమని, వైద్య ఖర్చులు ఒకవైపు, శారీరక వేదన మరోవైపు వారిని కృంగదీస్తున్నాయని అన్నారు. గమ్యాన్ని వేగంగా చేరడం కాదని, క్షేమంగా చేరడమే ప్రయాణానికి అసలైన సార్ధకతని తెలిపారు. ఈ బాధ్యతను ప్రతి పౌరుడు స్వీకరించినప్పుడే మరణాల సంఖ్య తగ్గుతుందని, రోడ్డు ప్రమాద రహిత సమాజం అవతరిస్తుందని తెలిపారు.

### అగ్నిప్రమాద బాధితురాలికి అండగా నిలిచిన

# సత్యం వాసంశెట్టి ఫౌండేషన్



**కే.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అగ్నిప్రమాదంలో ఇల్లు పూర్తిగా కాలిపోయి నిరాశ్రయురాలైన వ్యక్తికి సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అండగా నిలిచింది. ఆపదలో ఉన్న బాధితురాలికి భరోసా కల్పిస్తూ మానవతా దృక్పథంతో ఫౌండేషన్ సహాయక చర్యలు చేపట్టింది. రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగవరం మండలం సుందరపల్లి గ్రామానికి చెందిన కాశీ చిన్నమ్మాయి నివాసముంటున్న ఇల్లు షార్ట్ సర్క్యూట్ కారణంగా శుక్రవారం అగ్నికి ఆహుతైంది. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాల మేరకు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం బాధితురాలి నివాసాన్ని సందర్శించి పరామర్శించారు. ప్రమాదంలో జరిగిన నష్టాన్ని పరిశీలించి బాధితురాలికి ధైర్యం చెప్పారు. ఫౌండేషన్ తరఫున వస్త్రాలు, నిత్యావసర సరుకులు అందజేసి అండగా నిలిచారు. బాధితురాలికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని, ప్రభుత్వపరంగా కూడా పూర్తి స్థాయిలో ఆదుకునేలా చర్యలు తీసుకుంటామని వాసంశెట్టి సత్యం భరోసా ఇచ్చారు. ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలవడం ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని, ఎలాంటి కష్టనష్టాలు వచ్చినా ప్రజల పక్షాన నిలబడి సేవలందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# కాలువలోకి దూసుకెళ్లిన కారు వ్యక్తికి గాయాలు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం పలివెల పీజీ కాలేజీ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. గురువారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో అమలాపురం వైపు నుంచి వస్తున్న కారు ఆగి ఉన్న బస్సును తప్పించబోయి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. అనంతరం చెట్లను రాసుకుంటూ కాలువలోకి దూసుకెళ్లిపోయింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై కొత్తపేట నుంచి వస్తున్న కండ్రిగ గ్రామానికి చెందిన శీలం సత్తిబాబుకు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో అతడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులను స్థానికులు రక్షించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ప్రియదర్శిని బాలవిహార్‌లో జాతీయ పఠన దినోత్సవం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రియదర్శిని బాలవిహార్లో జాతీయ పుస్తక పఠన దినోత్సవం నిర్వహించారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభ మాసం రెండవ వారంలోనే ఈ జాతీయ పుస్తక పఠన దినోత్సవం రావడం పిల్లల్లో చదువు పట్ల చక్కటి స్ఫూర్తిని నింపటానికి ఎంతో ఉపయోగకరమని, అందుకే ఇంత ప్రత్యేకంగా ఈ గ్రంథ పఠన కార్యక్రమాన్ని నిర్వహించామని కరస్పాండెంట్ బుద్ధ చంద్రదేవ్ అన్నారు. హై స్కూల్ విద్యార్థులందరూ గంటన్నర సేపు స్కూలు గ్రంథాలయంలోని అనేక విజ్ఞాన సర్వస్వాలను ఎంతో ఆసక్తితో పరికించి పరిశీలించారు,పఠించారు. నిత్యం చదివే సబ్జెక్టు పుస్తకాలకు భిన్నంగా ఆకర్షణీయమైన బొమ్మలతో విభిన్న సంస్థలు ముద్రించిన విజ్ఞానదాయకమైన పెద్ద పుస్తకాలను చదవడం ఎంతో ఆనందదాయకంగా ఉందని పలువురు చిన్నారులు అన్నారు. తమకు తెలియని ఎన్నో అమూల్యమైన విషయాలను ఈ పుస్తక పఠనం ద్వారా గ్రహించామన్నారు. లైబ్రరీ పీరియడ్లో అనేక శాస్త్ర సాంకేతిక చరిత్ర కథల పుస్తకాలను చదువుతూ ఉంటారు. దానికి భిన్నంగా ఈరోజు ప్రత్యేకమైన బృహత్ గ్రంథాలను, రిఫరెన్స్ పుస్తకాలను వారి చేతికి ఇచ్చిచదివించడంతో చిన్నారులు ఆనందానికి గురి అయ్యారు. ఇచ్చిన పుస్తకాలను పిల్లలు కొంతవరకు మాత్రమే చదవగలిగారని పెద్ద పుస్తకాలు చదవడానికి మరిన్ని రోజులు అవసరం అవుతాయని ఈ సంవత్సరం వారం వారం జరిగే లైబ్రరీ పీరియడ్లో ఇవే పుస్తకాలను రిపీటెడ్ గా ఇస్తామని అకడమిక్ డైరెక్టర్ అద్దంకి సాహిత్య అన్నారు. కేవలం టెస్ట్ పుస్తకాలు మాత్రమే కాకుండా అదనపు పుస్తకాలను లైబ్రరీ పీరియడ్లో చదవడం మాకు అలవాటేనని అయితే ఈరోజు చదవడానికి మాకు ఇచ్చిన పుస్తకాలు మాలో నూతన ఉత్సాహాన్ని నింపే విధంగా ఉన్నాయని పిల్లలు అన్నారు. పిల్లలు చదివిన ఈ పుస్తకాలలో 90% పుస్తకాలు ఆంగ్ల మాధ్యమంలోనే ఉండటం విశేషం. ఈ కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఏ ఎస్ ఆర్ మూర్తి, హిందీ పండిట్ సత్యవాణి, బయాలజీ టీచర్ అనూష పాల్గొన్నారు.

# మందపల్లిలో ఏపీ దేవాదాయ ధర్మదాయ శాఖ కమీషనరు కె.రామచంద్ర మోహన్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డా.బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం, మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవస్థానం నందు గోదావరి పుష్కరములు 2027 సందర్భంగా భక్తుల సౌకర్యార్థం తైలాభిషేక మండప నిర్మాణం మరియు అన్నప్రసాద భావన నిర్మాణ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ కమీషనరు కె.రామచంద్ర మోహన్ దేవస్థానమునకు విచ్చేసి, తొలుత సదరు నిర్మాణ పనులు జరుగు స్థలమును పరిశీలించి, దేవదాయ ధర్మదాయ శాఖ ఇంజినీరింగ్ అధికారులకు తగు సూచనలు చేసియున్నారు. తదుపరి సదరు నిర్మాణ పనుల పురోగతి పట్ల సంతృప్తి వ్యక్తం చేసి, శ్రీ స్వామి వారు,అమ్మవార్లను దర్శనం చేసికొనియున్నారు అదేవిధంగా దేవస్థానం నందు ఇటీవల జరుగుచున్న పలు అభివృద్ధి పనులు విషయంలో మరియు గతంలో కంటే ప్రస్తుత దేవస్థాన రూపు రేఖలు మార్పుపై హర్షం వ్యక్తం చేసియున్నారు.వీరి వెంట దేవదాయ ధర్మదాయ శాఖ ఉన్నతాధికారులు అనగా డిప్యూటీ కమీషనరు రమేశ్ బాబు,జిల్లా దేవదాయ శాఖ అధికారి సత్యనారాయణ,టెక్నికల్ అడ్వైజర్ సుబ్బారావు, ఎస్.ఇ.దుర్గేశ్ కుమార్, డి.ఇ.ఉదయ్ కుమార్ ఉన్నారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు దంగేటి సాయి నాగ భూషణం, నేరేడుమిల్లి మహాలక్ష్మి ఏడుకొండలు,చిలకమర్తి అనంత లక్ష్మి సావిత్రి శ్రీనివాస్ పాల్గొనియున్నారు అని దారపురెడ్డి సురేష్ బాబు, సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి తెలియజేశారు.

# కాపు సమస్యల పరిష్కారానికి కృషిచేస్తాం

### కాపు కార్పొరేషన్ చైర్మెన్ సుబ్బారాయుడు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం లోని గోపాలపురంలో టీడీపీ సీనియర్ నాయ కుడు, కాపు ఉద్యమ నేత ఆకుల రామకృష్ణను కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాపు జేఏసీ నాయకులతో కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు.సమావేశంలో కాపు కార్పొరేషన్ ద్వారా కాపు, తెలగ, బలిజ వర్గాలకు అందాల్సిన రుణాలు, కాపు రిజర్వేషన్లు మరియు రాష్ట్రవ్యాప్తంగా కాపు సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అనంతరం సమావేశంలో మాట్లాడిన కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంలో కాపు, తెలగ, బలిజ వర్గాల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కాపు కార్పొరేషన్ రుణాల మంజూరుకు సానుకూలంగా ఉన్నారని తెలిపారు.గత ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నప్పటికీ, ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని గాడిలో పెట్టే దిశగా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే దిశగా ముందుకు సాగుతోందని, అదే క్రమంలో కాపు కార్పొరేషన్ రుణాల పంపిణీలో జరిగిన ఆలస్యాన్ని త్వరలో అధిగమించి లబ్ధిదారులకు రుణాలు అందజేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా రాష్ట్రంలోని కాపు సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ ఆకుల రామకృష్ణ, జేఏసీ నాయకులతో కలిసి కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడికి వినతిపత్రం అందజేశారు.

### మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవస్థానం నందు

# భక్తుల సౌకర్యార్థం స్టీల్ క్యూలైన్స్ వేయు నిమిత్తం రూ.3,00,000



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డా.బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం, మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవస్థానం నందు భక్తుల సౌకర్యార్థం స్టీల్ క్యూలైన్స్ వేయు నిమిత్తం గ్రంధి రాజేష్, రమా దంపతులు,ఇషి స్టీల్ రిసోర్సెస్ ఎల్ఎల్పి, మందపల్లి వారు రూ. 3,00,000/- లను చెక్కు ద్వారా కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానంద రావు చేతులు మీదుగా ధర్మకర్తల మండలి సభ్యులు సమక్షంలో అందజేసియున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు గంధం సత్య వెంకట నాగాజీ,గవర వీర వెంకట సత్యనారాయణ, దేవపాటి వెంకటేశ్వరరావు, నేరేడుమిల్లి మహాలక్ష్మి ఏడుకొండలు, చిలకమర్తి అనంత లక్ష్మి సావిత్రి శ్రీనివాస్ మరియు మందపల్లి ఎంపీటీసీ సభ్యులు సిద్ధంశెట్టి సత్యనారాయణ పాల్గొనియున్నారు అని దారపురెడ్డి సురేష్ బాబు, సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి తెలియజేశారు.



### నగరంలో గత 10 రోజులుగా

# నిలిచిపోయిన క్లాప్ వాహనాలు

**వాహనాలు నడిపించి జీవన భద్రత కల్పించాలని సిఐటియు ఆధ్వర్యంలో డ్రైవర్ల ఆందోళన**
**వాహనాలు నడిపిస్తామని ఎంహెచ్ఓ హామీ**




**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ నగర పాలక సంస్థ పరిధిలో ప్రతినిత్యం తడి చెత్త పొడి చెత్త సేకరించే క్లీన్ ఆంధ్ర ప్రదేశ్ (క్లాప్) వాహనాలు గత పది రోజులుగా నిలిచిపోవడం పట్ల సిఐటియు ఆధ్వర్యంలో డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. శుక్రవారం ఉదయం గాంధీనగర్ బాల్ భవన్ వద్ద జరిగిన ఆందోళన నేపథ్యంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా. పృథ్వీ చరణ్ డ్రైవర్స్ విన్నపము స్వీకరించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ బిల్లులు చెల్లించలేదని స్వయంభూ ట్రాన్స్ పోర్ట్ సంస్థ వారే గత బుధవారం వాహనాలు నిలిపి వేసారని తెలిపారు. 2025 జనవరి నుండి డ్రైవర్స్ జీతం నుండి మినహాయించిన పిఎఫ్, ఈఎస్ఐ ఆయా శాఖలకు జమ కాలేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, నగర పాలక సంస్థ ఏర్పాటు చేస్తున్న వాహనాలపై క్లాప్ డ్రైవర్స్ కు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఎంహెచ్ఓ మాట్లాడుతూ నగర పాలక సంస్థ నుండి 50 లక్షల రూపాయలు సిడిఎంఎకు పంపించడం జరిగిందన్నారు. వాహనాలు నడిపిస్తామని, 2026 డిసెంబర్ వరకు కాంట్రాక్టు కొనసాగుతుందన్నారు. డ్రైవర్ల కు ప్రత్యామ్నాయ ఉపాధి లో ప్రాధాన్యత ఇస్తామని హామి ఇచ్చారు. ఎంహెచ్ఓ స్పందన పట్ల డ్రైవర్స్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకటరమణ తో పాటు క్లాప్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు ఎస్.సంతోష్ కుమార్, విక్టర్, ఎం.కొండబాబు, టి.దుర్గా ప్రసాద్, అరుణ్, గంగాధర్, సూరిబాబు, ఇస్మాయిల్, రమణ, అప్పన్న, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నలు మీ ఫోన్‌లోనే ఎరువుల బుకింగ్

**ఇక లైన్లలో నిలబడే పని లేదుమీకు : జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్**




**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎరువులు పంపిణీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన 'నేషనల్ ఫార్మర్ ఫెర్టిలైజర్' యాప్ వినియోగంపై జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ప్రత్తిపాడు మండలం, ఏలూరు రైతు సేవా కేంద్రాన్ని జేసి.. రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక రైతులతో సమావేశమై ఎరువులు కొనుగోలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నేషనల్ ఫార్మర్ ఫెర్టిలైజర్'యాప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు మీ ఫోన్‌లోనే ఒక్క క్లిక్‌తో ఎరువులు పొందే సరికొత్త విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. రైతు సోదరులు ఎవరో ఇకనుంచి ఎరువుల కోసం లైన్లలో నిలబడే పని లేదని ఆయన వివరించారు. రైతులు ఎరువుల కోసం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఇకపై ఎరువుల కోసం తిరగాల్సిన పనిలేదు. యాప్‌లో బుక్ చేసుకుని, మీకు వచ్చిన క్యూఆర్ కోడ్ చూపించి నచ్చిన డీలర్ లేదా ఆర్ఎస్కే వద్ద ఎరువులు తీసుకోవచ్చని అని జేసి తెలిపారు. ఈ విధానం వల్ల రైతులకు సమయం ఆదా కావడమే కాకుండా, ఎరువులు ఎప్పుడు, ఎక్కడ అందుబాటులో ఉన్నాయో కూడా తెలుసుకోవచ్చని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు తహసీల్దార్ సూర్యప్రభ, ఎడీఏ శ్రీనివాస్ ప్రతిపాడు మండల వ్యవసాయ అధికారి జోక అమృత, మండల విస్తీర్ణ అధికారి అర్జున్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా అదనపు ఎస్పీగా కిషోర్ కుమార్ బాధ్యతలు స్వీకరణ



**కాకినాడ క్రైమ్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా నూతన అదనపు ఎస్పీ (అడ్మిన్)గా డాక్టర్ మహంతి కిషోర్ కుమార్ శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన జిల్లా ఎస్పీ జి బిందుమాధవ్'ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల అణచివేత, నేర నియంత్రణకు తీసుకోవాల్సిన పలు కీలక అంశాలపై ఎస్పీతో చర్చించారు.

**అదనపు ఎస్పీకి ఘన స్వాగతం**

డాక్టర్ మహంతి కిషోర్ కుమార్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లా పోలీస్ అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కాకినాడ డీఎస్పీ (ఏఆర్) వీజీ శ్రీహరి రావు, ఎస్బీ డీఎస్పీ కేవీవీ సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎంవీవీ సత్యనారాయణ మూర్తి, అడిషనల్ ఎస్పీ పిఎ కె.రామిరెడ్డితో పాటు పలువురు సీఐలు, ఎస్సైలు మర్యాదపూర్వకంగా కలుసుకొని, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఉండూరు రైల్వే గేట్ వద్ద ఇరుక్కున్న లారీ



**సామర్లకోట, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా సామర్లకోట శివారులోని ఉండూరు గ్రామ సమీపంలో ఉన్న రైల్వే గేటు సమీపంలో ఏర్పాటు చేసిన ఇనుప గడ్డరు వద్ద భారీ లోడుతో వస్తున్న లారీ ఇనుప గడ్డర్‌ను ఢీ కొట్టి ఇరుక్కుపోయింది. ఎత్తయిన, భారీ వాహనాలు వెళ్లకుండా గేటుకు ఇరు వైపులా ఇనుప గడ్డర్లు ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో వెళ్తున్న ఎత్తైన లోడుతో వెళ్తున్న లారీ గేటు దాటిన తర్వాత ఇనుప గడ్డరు వద్ద ఇరుక్కుపోయింది. దీంతో ట్రాఫికు అంతరాయం ఏర్పడింది. రైల్వే పోలీసులు మరియు సామర్లకోట ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని లారీని బయటకు తీసే పనిలో ఉన్నారు.

# ఉద్యోగుల పీజీఆర్ఎస్‌కు 23 అర్జీలు



**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం నిమిత్తం శుక్రవారం సాయంత్రం కాకినాడ కలెక్టరేట్ ప్రజావాణి హాలులో ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం జరుగింది. ఈ కార్యక్రమంలో జిల్లాఇన్చార్జ్ రెవెన్యూ అధికారి, ఈసీ కార్పొరేషన్ ఈడి ఏ.శ్రీనివాసరావు, జీజీచ్ పరిపాన అధికారి ఎన్.శ్రీధర్‌తో కలిసి ఉద్యోగుల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఉద్యోగులకు సంబంధించిన వివిధ సమస్యలపై 23 అర్జీలు అందాయని ఇన్చార్జ్ డీఆర్వో తెలిపారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ఉద్యోగుల సమస్యల పరిష్కార నిమిత్తం ప్రతినెల 3వ శుక్రవారం ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని సద్వని చేసుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలపై 30న చలో విజయవాడ

**నాడు బాడీ డోర్ డెలివరీ నేడు మిస్టరీ - ఈ రెండేళ్లలో ఏమి సాధించారని విజయోత్సవ సభలు**
**రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు**



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** గత రెండేళ్లగా మన రాష్ట్రంలో రైతాం గం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడు తుందని ముఖ్యంగా కౌలు రైతుల పరిస్థితి వర్ణాతీతంగా ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు అన్నారు. అలాగే గడిచిన రెండేళ్ల కూటమి పాలనలో ఏం చేశారు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ కాకినాడ జిల్లా సమితి సమావేశాలు సందర్భంగా కార్యాలయంలో ఆయన పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ పంటలకు కనీస మద్దతు ధర లేక సిండికేట్ మార్కెట్ మాయాజాలంతో రైతులు విల విల లాడుతున్నారని ఆయన పేర్కొన్నారు. అప్పులు చేసి అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని మధు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఏ ఒక్క కౌలు రైతుకు ఏ ఒక్క బ్యాంకు వ్యవసాయ, ఉద్యాన పథకాలు ఇవ్వడం లేదన్నారు. గత ఎన్నికల ముందు డాక్టర్ ఎమ్మెస్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేస్తామని చెప్పి ఇప్పటివరకు అమలకు నోచుకోలేదని ఆయన మోడీపై విమర్శలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగా మన రాష్ట్రములో రెండు లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేసి ఆత్మహత్యలనుంచి రైతాంగాన్ని కాపాడాలని మధు కోరారు. యుద్ధం నేపథ్యంలో ఇటీవల పెరిగిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, పెట్రోల్, డీజిల్, వ్యవసాయ, యంత్ర పరికరాలు ధరలు వెంటనే తగ్గించాలని మధు డిమాండ్ చేశారు. ఆక్వా రైతులకు రొయ్యల ఫీడ్, సీడ్, మెడిసిన్ ధరలను తగ్గించాలని జోన్, నాన్ జోన్ పరిమితులు లేకుండా ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్తును రూపాయి 50 పైసలకే అందించాలని, రొయ్యలకు మద్దతు ధర ప్రకటించాలని మధు డిమాండ్ చేశారు. పాలకుల కళ్ళు తెరిపించడానికి మన హక్కులు సాధించడానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతులు ఈ నెల 30న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కౌలు రైతు సంఘం చేస్తున్న చలో విజయవాడ కార్యక్రమానికి సిపిఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని మధు ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రతి జిల్లాలో విజయోత్సవ సభలు నిర్వహిస్తున్నారని ఈ రెండు ఏళ్లలో ప్రజలకు ఏం చేశారో బహిరంగంగా చెప్పాలని పేర్కొన్నారు పెన్షన్ జీతాలు ఇవ్వడం, చిన్నపాటి రోడ్లు వేయడం ఇవన్నీ ప్రతి ప్రభుత్వం చేస్తుందని ఈ రెండేళ్లలో చంద్రబాబు ఒక ప్రాజెక్టు పూర్తి చేశారా? ఒక్క ప్రభుత్వ కళాశాల నిర్మించారా? ఒక్క ప్రభుత్వ సంస్థలు నిర్మాణం చేశారా? విశాఖపట్నం ఉక్కు పరిశ్రమను పరిరక్షించారా? కడప స్టీల్ ఫ్యాక్టరీ తీసుకొచ్చారా? సాగునీటి ప్రాజెక్టులు కట్టారా ?నిరంతరం పనిచేసే కార్మికుల జీతాలు రూపాయి అయినా పెంచారా అని ప్రశ్నించారు. పేదలకు ఇస్తామన్న ఇంటి స్థలాలు ఇచ్చారా ప్రైవేట్ ప్రైవేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులతో తల్లిదండ్రులని దోచుకుంటుంటే ఎక్కడైనా అరికట్టరా నిరోధ్యగ భృతి ఇచ్చారా అని ప్రశ్నించారు. నాడు డోర్ డెలివరీ నేడు సాయి కృష్ణ బాడీ అదృశ్యం అయ్యిందని అన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని చెప్పారు. హామీలు అమలు చేయక పోగా మరలా బీచ్లో మద్యం దుకాణాలు తెరుస్తారా సిగ్గుందా మీకు అని మధు దుయ్యబట్టారు. మీరే బార్లు పెడతారు మరలా బయట తాగి రోడ్డు మీద తిరిగితే మరల మీరే కేసులు పెడతారు తాగమనేది మీరే మా దగ్గర డబ్బులు దొబ్బేది మీరే ఇది ఎక్కడ అన్యాయం అని మధు ప్రశ్నించారు. ఇవన్నీ సమస్యలపై జిల్లా సమితిలో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ ముందుకు తీసుకెళ్లి ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని ప్రజలకు అండగా ఉంటామని తాటిపాక మధు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కే.బోడకొండ, జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు పి సత్యనారాయణ, శాఖ రామకృష్ణ, ఏ.భవాని, బొబ్బిలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బంగారు నగల దొంగతనం కేసులో నిందితురాలి అరెస్ట్

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎస్.యానం గ్రామంలోని ఓ ఇంట్లో జరిగిన బంగారు నగల దొంగతనం కేసును పోలీసులు ఛేదించి నిందితురాలిని అరెస్ట్ చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో అమలాపురం డీఎస్పీ టి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా స్వాధీనం చేసుకున్న బంగారు నగలను కూడా ప్రదర్శించారు. డీఎస్పీ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం, ఎస్.యానం గ్రామానికి చెందిన చిలుకూరి రాంబాబు తన భార్య అనంతలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతుండటంతో 2022 నుంచి విశాఖపట్నం జిల్లా మధురవాడలో అద్దె ఇంటిలో నివాసం ఉంటూ చికిత్స చేయిస్తున్నారు. ఆ సమయంలో అనంతలక్ష్మి సంరక్షణ కోసం విజయనగరం జిల్లా గంట్యాడ మండలం బుడతనపల్లి గ్రామానికి చెందిన బోనంగి శాంతి అలియాస్ వర్షిణిని ఇంటి పనులకు నియమించుకున్నారు. అనంతలక్ష్మి ఆరోగ్యం మెరుగుపడడంతో ఇటీవల మధురవాడలోని అద్దె ఇంటిని ఖాళీ చేసి స్వగ్రామమైన ఎస్.యానంకు వచ్చారు. ఇంటి పనుల కోసం శాంతిని కూడా తమ వెంట తీసుకువచ్చారు. అయితే మూడు రోజుల పాటు ఇంట్లో ఉన్న శాంతి అనంతరం తన స్వగ్రామానికి వెళ్లిపోయింది. శాంతి వెళ్లిన తర్వాత ఇంట్లోని బీరువా తాళాలు కనిపించకపోయినా, బంగారు ఆభరణాల అవసరం లేకపోవడంతో కుటుంబ సభ్యులు బీరువాను తెరవలేదు. అయితే గత నెల 23న ఓ శుభకార్యానికి వెళ్లేందుకు ఆభరణాలు అవసరం కావడంతో బీరువా తాళం పగులగొట్టి చూడగా అందులో ఉన్న 18 కాసుల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో దొంగతనం జరిగినట్లు గుర్తించిన రాంబాబు, శాంతిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు శుక్రవారం శాంతిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో దొంగతనం చేసినట్లు



అంగీకరించడంతో ఆమె వద్ద నుంచి 18 కాసుల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితురాలిని అరెస్ట్ చేసి అమలాపురం కోర్టుకు తరలించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసును తక్కువ సమయంలోనే ఛేదించి, దొంగిలించిన బంగారు నగలను రికవరీ చేసిన అమలాపురం రూరల్ సీఐ డి. ప్రశాంత్ కుమార్, స్థానిక ఎస్ఐ ఎస్.కె. జానీ బాషా, హెడ్ కానిస్టేబుళ్లు బి.వి. గిరి (857), కె. హరినాథ్ (2606), కానిస్టేబుళ్లు వి. నాగరాజు (4195), ఎస్.డి. కరీం చంద్ (4239), మహిళా కానిస్టేబుల్ ఆర్. కనకదుర్గ (3769)లతో కూడిన పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా అభినందించినట్లు డీఎస్పీ ప్రసాద్ తెలిపారు.

# ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీపై నిరసన

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచం ద్రపురం మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద పీ.డీ.ఎస్.యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. సిద్ధూ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని వారు డిమాండ్ చేశారు. నిబంధనలు పాటించని విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, గుర్తింపు లేకుండా నడుస్తున్న సంస్థలను వెంటనే సీజ్ చేయాలని కోరుతూ మండల విద్యాశాఖ అధికారి ఎం.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బి.సిద్ధూ మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గంలోని విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులపై ఫీజుల భారం మోపుతున్నాయని ఆరోపించారు. ఎల్‌కేజీ నుండి పదవ తరగతి వరకు లక్షల రూపాయల ఫీజులు వసూలు చేయడమే కాకుండా, మార్కెట్‌లో రూ.1000 విలువ చేసే పుస్తకాలను

### విద్యాశాఖ అధికారికి వినతిపత్రం



రూ.10,000 వరకు విక్రయిస్తున్నారని విమర్శించారు. యూనిఫాంలు, బస్సు ఫీజులు, ప్రత్యేక రుసుములు, ఇతర ఛార్జీల పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తూ తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. విద్యా వ్యాపారం మూడు పూలు ఆరు కాయలుగా కొనసాగుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, అడ్మిషన్లు, హాస్టల్స్, కోచింగ్ పేరుతో తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితిని విద్యాసంస్థలు దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా హక్కు చట్టాన్ని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అనేక సంస్థలు పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని అన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని విద్యా సంస్థలపై విద్యాశాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పీ.డీ.ఎస్.యూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమస్యలను పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు వెంటపల్లి భీమశంకరం, ఉమ్మడి జిల్లా ఐ.ఎఫ్.టీ.యూ నాయకులు చింతా రాజారెడ్డి, బుజ్జి, శివ, రవి, ఉదయ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబాల సమగ్ర సర్వే వివరాల ధృవీకరణ

**గ్రామ, వార్డు సభల నిర్వహణకు అధికారుల ఆదేశం**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం జిల్లా సామాజిక సంక్షేమ అధికారి వి.విజయలక్ష్మి ఆదేశాల మేరకు, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుటుంబాల సమగ్ర సర్వే వివరాల ధృవీకరణ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా జరుగుతోంది. సర్వే ద్వారా సేకరించిన కుటుంబాలు మరియు పౌరుల వివరాల్లో ఖచ్చితత్వం, పారదర్శకత ఉండాలని, ఇందుకోసం అన్ని గ్రామ పంచాయతీలు మరియు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని అధికారులు సూచించారు. ఈ ఆదేశాల మేరకు జూన్ 18వ తేదీన పంచాయతీ కార్యదర్శులు, వార్డు పరిపాలనా కార్యదర్శులు సర్వే వివరాలను ప్రజల పరిశీలన కోసం ప్రదర్శించారు. దీనిని కొనసాగిస్తూ జూన్ 19వ తేదీన గ్రామ, వార్డు సభలు నిర్వహించి ప్రజల సమక్షంలో ఈ వివరాలను ధృవీకరించాలని అధికారులు నిర్దేశించారు. సర్వే వివరాలపై ఏవైనా అభ్యంతరాలు లేదా ఫిర్యాదులు ఉంటే జూన్ 19 నుండి జూన్ 24వ తేదీ లోపు అంతర్జాల అనుసంధాన వేదిక ద్వారా తెలియజేయవచ్చని అధికారులు పేర్కొన్నారు. కులానికి సంబంధం లేని ఫిర్యాదులను జూన్ 26వ తేదీ లోపు, కుల సంబంధిత ఫిర్యాదులను జూన్ 27వ తేదీ లోపు పరిశీలించి పరిష్కరించాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియలో ప్రజలకు అవసరమైన సహకారాన్ని డిజిటల్ సహాయకులు, వార్డు సంక్షేమ మరియు అభివృద్ధి కార్యదర్శులు అందించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది మరియు పౌరులు అందరూ గ్రామ, వార్డు సభల్లో పాల్గొని, ఈ ధృవీకరణ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేసేందుకు సహకరించాలని జిల్లా సామాజిక సంక్షేమ అధికారి కోరారు.

### రామచంద్రపురంలో చిరు వ్యాపారులకు

# గొడుగులు పంపిణీ చేసిన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణంలో మండుటెండలో రోడ్ల వెంబడి చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వ్యాపారులకు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అండగా నిలిచింది. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వారి ఉపాధికి ఇబ్బంది కలగకుండా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గొడుగులను పంపిణీ చేశారు. శుక్రవారం పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లు, వ్యాపార కేంద్రాల్లో "సేవే సత్యం – సేవే నిత్యం" నినాదంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్ల పక్కన పండ్లు, కూరగాయలు, చిరుతిండి వస్తువులు విక్రయిస్తున్న వ్యాపారులకు ఈ గొడుగులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని భావించి వీటిని అందజేశారు. ఈ సందర్భంగా సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ మండుటెండలో రోజంతా కష్టపడే చిరు వ్యాపారులకు కొంత ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రజా సేవే లక్ష్యంగా ఫౌండేషన్ ద్వారా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సామాన్య ప్రజల అవసరాలను గుర్తించి వారికి ఉపయోగపడే కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా చేపడతామని ముఖ్యంగా కార్మికులు, పేద, బలహీన వర్గాల సంక్షేమానికి ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. గొడుగులు అందుకున్న చిరు వ్యాపారులు తమ కష్టాలను గుర్తించి సహాయం అందించిన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఫౌండేషన్ సభ్యులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



# సంక్షేమం, అభివృద్ధి, శాంతిభద్రతలే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## క్వారీ ప్రాంతానికి రూ.95 కోట్ల తాగునీటి ప్రాజెక్టు వరం : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** క్వారీ ప్రాంత ప్రజలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు అమృత్ 2.0 పథకం కింద రూ.95 కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) తెలిపారు. క్వారీ సెంటర్ శివాలయం వద్ద నిర్వహించిన "రెండేళ్ల నమ్మకం – – అభివృద్ధి, సంక్షేమం" నియోజకవర్గ స్థాయి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో ఈ ప్రాజెక్టు మంజూరైందన్నారు. 45, 46, 47, 48, 49 వార్డుల ప్రజలకు ఉదయం, సాయంత్రం నిరంతరాయంగా తాగునీరు అందించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తైందని, మరో 10 నుండి 15 రోజుల్లో పనులు ప్రారంభమై ఏడాది వ్యవధిలో పూర్తి చేస్తామని వెల్లడించారు. క్వారీ ప్రాంతాన్ని గతంలో వైకాపా వారు రాజకీయంగా నిర్లక్ష్యం చేశారని, కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ ప్రాంత అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఇప్పటికే ఈ ప్రాంతంలోని వార్డుల్లో రూ.8 నుండి రూ.9 కోట్ల వరకు అభివృద్ధి పనులు చేపట్టామని, రాబోయే గోదావరి పుష్కరాల నాటికి మరో రూ.55 కోట్ల విలువైన రోడ్లు, డ్రైనేజీలు తదితర పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మొత్తంగా రూ.65 కోట్లకు పైగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. 49వ వార్డులోని సింహాచల్ నగర్‌లో రూ.70 లక్షలతో ఆధునిక పార్కు అభివృద్ధి పనులు చేపడుతున్నామని, వాకింగ్ ట్రాక్, భద్రతా గోడలు, ఫెన్సింగ్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు కోరిన చోట్ల రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తున్నామని చెప్పారు. బలహీన వర్గాల ప్రాంతమని క్వారీ ప్రాంతాన్ని ఎవరూ చిన్నచూపు చూడలేరని, ప్రభుత్వాలను గెలిపించే శక్తి ఉన్న బలమైన వర్గాలు ఇక్కడ నివసిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 2019లో రాష్ట్రవ్యాప్తంగా ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ ఈ ప్రాంత ప్రజలు టీడీపీకి అండగా నిలిచిన విషయాన్ని గుర్తు చేశారు. సంక్షేమ పథకాల అమలులో కూడా కూటమి ప్రభుత్వం ముందుందని ఎమ్మెల్యే వాసు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కొత్త పెన్షన్లు, కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని విమర్శిస్తూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల్లోనే నియోజకవర్గంలో 722 కొత్త పెన్షన్లు, 8 వేల రేషన్ కార్డులు మంజూరు చేసిందన్నారు. త్వరలో మరిన్ని వితంతు పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం రాజీ పడదని స్పష్టం చేసిన ఎమ్మెల్యే, మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, పార్టీతో సంబంధం లేకుండా తప్పు చేసిన వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 130 మంది రౌడీషీటర్లపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మూడేళ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో అనేక చారిత్రక నిర్ణయాలు తీసుకుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీల మేరకు రూ.4,000 సామాజిక పెన్షన్ అమలు చేశారని, విద్యార్థులకు "తల్లికి వందనం", రైతులకు, మహిళలకు, పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. ఈ సందర్భంగా క్వారీ ప్రాంతంలో చేపట్టనున్న మంచి నీటి ప్రాజెక్టుపై ప్రదర్శించిన లఘు చిత్రం ఆ ప్రాంత ప్రజలను ఆకట్టుకుంది. నగర టీడీపీ అధ్యక్షులు మజ్జి రాంబాబు అధ్యక్షతన, మాజీ కార్పొరేటర్లు కొయ్యల రమణ, మొకమాటి సత్యనారాయణ సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, కూటమి నాయకులు కాశీ నవీన్ కుమార్, అత్తి సత్యనారాయణ, వర్రే శ్రీనివాసరావు, యాళ్ల ప్రదీప్, వై శ్రీను, రెడ్డి మనేశ్వరరావు, ఉప్పులూరి జానకిరామయ్య, కడలి రామకృష్ణ, కంటిపూడి రాజేంద్రప్రసాద్, జక్కంపూడి అర్జున్, అగురు ధన్‌రాజ్, జవ్వాది మురళి, కోసూరి చండిప్రియ, మళ్ల వెంకటరాజు, నక్కా దేవివర ప్రసాద్, రుంకాని విజయ్, దాస్యం ప్రసాద్, మజ్జి మణికంత, అజ్జరపు రమేష్, కందికొండ అనంత్, చాపల చిన్నరాజు, బొర్రా చిన్ని, దుత్తరపు గంగాధర్, బేసరి చిన్ని, బత్తుల కిరణ్, సింహా నాగమణి, లీలావతి, కానేటి ప్రభుదాస్, కానేటి కృపామణి, బూరా రమణతో పాటు అధిక సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# నా నియోజకవర్గ అభివృద్ధి నా ధ్యేయం : బత్తుల

## అభివృద్ధికి అడ్డుకట్ట వేయకండి : బొడ్డు - స్థానిక సంస్థల్లో చిన్న తమ్ముడికి అవకాశం ఇవ్వండి





**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం నియోజకవర్గం అభివృద్ధి తన ధ్యేయమని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామరామకృష్ణ అన్నారు. శుక్రవారం బూరుగుపూడి ద్వారకామాయి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఎన్డీఏ రెండేళ్ల పాలనలో నమ్మకం– అభివృద్ధి సంక్షేమం విజయోత్సవ సభ ఘనంగా నిర్వహించారు. ఎన్డీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవ సభకు శాసనసభ్యులు బలరామకృష్ణ, జిల్లా తెదేపా అధ్యక్షులు బొడ్డు వెంకటరమణ చౌదరి, భాజపా జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గ అభివృద్ధి తన ధ్యేయమని, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ఏ విధంగా ముందుకెళుతుందో, అదే విధంగా నియోజకవర్గంలోనూ కలిసికట్టుగా పనిచేసి నియోజకవర్గాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామన్నారు. అభివృద్ధి సంక్షేమంతో పాటు త్వరలో అర్హులందరికీ పింఛన్లు. మూడు సెంట్లు ఇళ్ల స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి లోన్లు అందజేస్తామన్నారు. వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ గత ప్రభుత్వం కూల్చే ప్రభుత్వమని, మన ఎన్డీఏ ప్రభుత్వం నిర్మించే ప్రభుత్వం అన్నారు. వైసీపీ పాలనలో రైతులు, మహిళలు ఎన్నో ఇక్కట్లు ఎదుర్కొన్నారని, నారా లోకేష్ రాష్ట్రాన్ని పారిశ్రామిక హబ్బుగా తీర్చిదిద్ది, 26 లక్షల మందికి ఉపాధి కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. భాజపా అధ్యక్షులు నాగేంద్ర మాట్లాడుతూ 12 ఏళ్ల మోదీ పాలనలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. గత కాంగ్రెస్ పాలనలో భారత్ అన్ని దేశాల్ని పరిచయం చేసుకోవాల్సి వచ్చేదని, ఇప్పుడు మోడీ హయాంలో భారత్ నే సంపన్న దేశాలు పరిచయం చేసుకుంటున్నాయన్నారు. ఏది ఏమైనా ఎన్డీఏ కూటమి నాయకులు చిన్న చిన్న విభేదాలను పక్కనపెట్టి, భాజాపాకు అవకాశం కల్పించి, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయాన్ని సాధిద్దామన్నారు. లేనిపక్షంలో మరోసారి విధ్వంస పాలనను చూడవలసి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, ఎన్డీఏ నాయకులు కంటే నాగ కేశవరావు, తనకాల నాగేశ్వరరావు, అడపా వీరబాబు, రొంగల శ్రీనివాస్, పుప్పాల వెంకటరత్నం, నీరుకొండ వీరన్న చౌదరి, ఏపీఆర్ చౌదరి, గంగిశెట్టి చంటిబాబు, చిట్టిప్రోలు పద్దరాజు, నాతిపం దొరబాబు, చిట్టిప్రోలు సత్తిబాబు, అడ్డాల శ్రీను,యర్రంశెట్టి పోలరావు, బద్దిరెడ్డి దొర, ముక్క రాంబాబు, తన్నీరు తాతాజీ జన సైనికులు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### వినూత్న రీతిలో పాన్ ఇండియా సినిమా

# "నాగబంధం" ప్రచార సందడి

## రాజమండ్రి పుష్కరఘాట్‌లో అనంత పద్మనాభ స్వామి విగ్రహానికి పూజలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారీ పాన్–ఇండియా తెలుగు ఫాంటసీ–అడ్వెంచర్ చిత్రం "నాగబంధం"ప్రచారం శుక్రవారం రాత్రి రాజమండ్రి పుష్కరఘాట్‌లో వినూత్నంగా జరిగింది. ఈ చిత్ర ప్రచారంలో భాగంగా భారీ లారీపై తీసుకువచ్చిన అనంతపద్మనాభ స్వామి విగ్రహ నమూనాకు పుష్కరఘాట్ లో పూజలు చేశారు. ప్రేక్షకులకు ఈ విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సినిమాకు అభిషేక్ నామా దర్శకత్వం వహించగా విరాట్ కర్ణ హీరోగా, నభా నటేష్,ఐశ్వర్య మీనన్ కథానాయికలుగా కనిపించనున్నారు. కిషోర్,ఐశ్వర్య నిర్మాతలు. ఈ చిత్రాన్ని జూలై3 వ తేదీన తెలుగు,హిందీ,తమిళ,కన్నడ,మళయాళ భాషల్లో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా సినిమాలోని ఓ పాటకు స్థానిక చిన్నారులు సంప్రదాయ భరత నాట్యం ప్రదర్శనతోఅలరించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీ మార్గాని భరత్ మాట్లాడుతూ సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. చిత్ర ప్రచారంలో భాగంగా తీసుకువచ్చిన అనంతపద్మనాభ స్వామి విగ్రహం అందరినీ భక్తిభావంలో ముంచెత్తుతోందని అన్నారు. యాంకర్ చరిష్మా చిత్ర విశేషాలను వివరించారు. ఈ సినిమా భారతదేశంలోని ప్రాచీన విష్ణు దేవాలయాల రహస్యాలు, నిధులు మరియు "నాగబంధం" అనే ఆధ్యాత్మిక–పౌరాణిక భావన చుట్టూ తిరుగుతుందని, అనంతపద్మనాభ స్వామి దేవాలయం, జగన్నాధస్వామి ఆలయాల నిధుల కథల నుండి ప్రేరణ పొందిన అడ్వెంచర్ థ్రిల్లర్‌గా రూపొందుతోంది. "ది సీక్రెట్ ట్రెజర్"అనే టాగ్ లైన్‌తో ఇటీవల విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని కలిగిస్తున్నాయి.

# నూతన ఎస్ఐను మర్యాదపూర్వకంగా కలిసిన బీసీ నాయకులు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా ఎల్.శ్రీనివాస్ నాయక్ బాధ్యతలు స్వీకరించారు. సీతానగరం మండల బీసీ నాయకులు సీతా నగరం మండల సోషల్ మీడియా కన్వీనర్ పుక్కాల శ్రీనివాస్, సింగ వరం సర్పంచ్ సంగాన పోసియ్య ఇతర నాయకులు నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఎస్సైను మర్యాదపూర్వకంగా కలిశారు.

# రాష్ట్రంలో ఆటవిక పాలన సాగుతోంది

**మా ప్రభుత్వం వచ్చాక అందరీ భరతం పడతాం – 23 ఏళ్ల యువకుడు లాకప్ డెత్ ప్రశ్నిస్తే కొట్టి చంపేస్తారా!**
**మీడియా సమావేశంలో పోలీస్ శాఖ, రాష్ట్ర ప్రభుత్వ రాక్షస పాలనపై మండిపడ్డ మాజీ ఎంపీ భరత్**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో రెడ్ బుక్కు రాజ్యాంగం అమలు అవుతుందని, ప్రశ్నించిన వారిని అక్రమ కేసులు పెట్టడం, ఇళ్లల్లోకి జోరబడి కొట్టి చంపేస్తున్నారని వైసీపీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ మండి పడ్డారు. కూటమీ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తుందని, పోలీస్ స్టేషన్లు తెలుగుదేశం కార్యాలయాలుగా మారాయని పోలీసు అధికారులు తెలుగుదేశం పార్టీ తాబేదారులుగా మారారని విమర్శించారు. స్థానిక వైసిపి పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో మే నెలలో 23 సంవత్సరాల యువకుడ్ని పోలీసు లాకప్‌లో చిత్రహింసలకు గురిచేసి చంపేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఘటన మేలో జరిగితే ముఖ్యమంత్రి జున్‌లో స్పందించడం ఏమిటన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాలన జరుగుతుందా ప్రజాస్వామ్య పాలన జరుగుతుందా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో అటవీక రాజ్యం నడుస్తుందని విమర్శించారు. ఇక చట్టాలు, న్యాయస్థానాలు ఎందుకని పోలీసులు ఇంట్లోకి వెళ్లి కొట్టి చంపేస్తున్నారని వారికి ఎవరు ఇచ్చారు అధికారం అని ప్రశ్నించారు. టిడిపి కార్యకర్తలకే ప్రాణహాని ఉందంటే వైసిపి కార్యకర్తలకు పరిస్థితులు ఎలా ఉంటాయో అర్థమవుతుందన్నారు. రాష్ట్ర హోంమంత్రి నియోజకవర్గ సమీపంలో తుని దగ్గర ఒక గ్రామంలో రెండేళ్ల చిన్నారి అదృశ్యమయ్యి 15 రోజులు గడిచిన ఆ చిన్నారి జాడకు కనుకోకపోవడం ప్రభుత్వ, పోలీసులు వైపల్యం తేటతెల్లమవుతుందని విమర్శించారు. తమ వద్ద ఆధునిక యంత్ర పరికరాలు ఉన్నాయని సాంకేతికత ఉందని గొప్పలు చెప్పుకుంటున్న పోలీస్ శాఖ చిన్నారిని ఇంతవరకు కనిపెట్టడం లేదని పోలీస్ శాఖ నిర్వీర్యం అయిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వ పెద్దల చెప్పు చేతల్లోఉన్న పోలీస్ అధికారులు గుర్తుపెట్టుకోవాలని చట్ట వ్యతిరేకంగా పనిచేస్తున్న వారి పేర్లు లిస్ట్ రాస్తున్నామని తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత చట్టపరంగా విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరానికి చెందిన తమ పార్టీ బీసీ నాయకులు పీతారామకృష్ణను అరెస్టు చేయడాన్ని ఖండించారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రామకృష్ణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లా నూర్ భాషా సంఘం అధ్యక్షుడు షేక్ ఇబ్రహీం మృతి





**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేటకు చెందిన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నూర్ భాషా సంఘం అధ్యక్షుడు, మాజీ కో ఆప్షన్ సభ్యులు షేక్ ఇబ్రహీం (59) అనారోగ్యం తో మృతి చెందారు. ఆయనకు భార్య సుబన్ బి, కుమారులు షేక్ కరీం, షేక్ రాహుల్ లు ఉన్నారు. షేక్ కరీం ఏం ఎస్ సర్జన్ గా పనిచేస్తున్నారు. తాపీ మేస్త్రి సంఘం అధ్యక్షులుగా మూడేళ్లు పనిచేశారు. ప్రస్తుతం ఆ సంఘం గౌరవ అధ్యక్షులుగా ఉన్నారు. బిల్డర్‌గా మంచి పేరు తెచ్చుకున్నారు. రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు కు అత్యంత సన్నిహితులుగా ఉన్నారు. రాష్ట్ర టిడిపి మైనార్టీ సెల్ కార్యదర్శి సల్మాన్ హుస్సేన్‌తో సన్నిహితంగా ఉంటూ టీడీపీ కోసం విశేష కృషి చేశారు. 2021 లో జరిగిన మండపేట పురపాలక సంఘం 29 వ వార్డు కౌన్సిలర్ ఎన్నికలో టిడిపి నుండి పోటీ చేశారు. కాగా ఆ ఎన్నికల్లో ఓడిపోయారు. అదే కౌన్సిల్ చివరి ఏడాది ఆయన మునిసిపల్ కో ఆప్షన్ సభ్యులుగా ఎన్నికయ్యారు.నూర్ భాషా ల సంక్షేమానికి విశేష కృషి చేశారు. టిడిపి పట్ల నిబద్ధత తో పని చేశారు.ముస్లిం మైనార్టీ ల కోసం నిరంతరం పాటు పడ్డారు. గాంధీనగర్ లోని అల్ అమీన్ మస్జిద్ నిర్మాణం, విజయలక్ష్మి నగర్ లోని అల్ అక్సా మస్జిద్ నిర్మాణం లోనూ కీలక పాత్ర పోషించారు. గాంధీనగర్ షాది ఖానా నిర్మాణ కమిటీ సభ్యులు గా ఉన్నారు. మూడునెలల క్రితం ఆయన తీవ్ర అస్వస్థత కు గురయ్యారు. హైదరాబాద్ లో చికిత్స చేయించారు. కాగా మండపేట మహాలక్ష్మి నగర్ లోని ఆయన స్వగృహం లో తుది శ్వాస విడిచారు. శుక్రవారం గాంధీ నగర్ అల్ అమీన్ మస్జిద్ లో జనజా నమాజ్ అనంతరం మండపేట కలువపువ్వు సెంటర్ లో ఉన్న జామియా మస్జిద్ ఆవరణ లోని శ్మశాన వాటికలో ఖననం చేశారు. ఇబ్రహీం మృతి పట్ల మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు వి సాయి కుమార్ బాబు, వేగుళ్ళ అజయ్ బాబు, వైసిపి నాయకులు రెడ్డి రాధాకృష్ణ, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు కామన్ ప్రభాకరరావు,మాజీ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి,మాజీ కౌన్సిలర్ బండి గోవిందు,నూర్ భాషా సంఘం నాయకులు షేక్ సలీం , షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ అలీ ఖాన్ బాబా, షేక్ మస్తాన్ ,షేక్ మీరా సాహెబ్, షేక్ బాదుల్లా, షేక్ మౌలాలి, షేక్ మౌలానా, షేక్ దరియా తదితరులు సంతాపం తెలిపారు.

# సునీల్ అక్రమ అరెస్ట్ తీవ్రంగా ఖండిస్తున్నాం

**బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొండపల్లి దుర్గారావు – బీసీలపై అక్రమ కేసులు పెట్టి అణగద్రొక్కుతున్న కూటమి ప్రభుత్వం**
**ఎన్నికలలో ఇచ్చిన సూపర్ 6 హామీలను అమలు చేయని కూటమి ప్రభుత్వం**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్ అక్రమ అరెస్ట్ ను తీవ్రంగా ఖండిస్తున్నామని తూర్పుగోదావరి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు కొండపల్లి దుర్గారావు అన్నారు. శుక్రవారం రాజమండ్రి సంహిత డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్ అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండించారు. ఆ శాఖతో ఏ విధమైన సంబంధంలేని సునీల్ ఎలా అరెస్ట్ చేస్తారని ప్రశ్నించారు. ఎలాంటి సంబంధం లేకపోయినప్పటికీ అక్రమ కేసులో ఇరికించి అరెస్ట్ చేశారని ఆరోపించారు. సునీల్ పై అక్రమ కేసులు ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రులు విడుదల రజిని, జోగి రమేష్ ఇళ్లపై దాడులు చేశారని అన్నారు. ఏలూరు ఎంపీ డ్రగ్స్ కేసులో పట్టుపడితే స్టేషన్ బెయిల్ పై విడుదల చేశారని అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలపై అక్రమ కేసులు పెట్టి దాడులు చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు బీసీలకు రక్షణ చట్టం తీసుకొస్తామని, పెన్షన్లు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా తుంగలో తొక్కి బీసీలపై దాడులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఇదే విధంగా బీసీలపై దాడులు జరిగితే బీసీలంతా ఒక తాటిపైకి వచ్చి కూటమి ప్రభుత్వాన్ని గద్దె దించుతామని హెచ్చరించారు. చంద్రబాబు 2014 నుంచి 19 వరకు ఇంటింటికి మద్యం ను ఏరులై పారించారని, టిడిపి నాయకులకు మద్యం షాపులు కట్టబెట్టి డోర్ డెలివరీ చేయించారని అన్నారు. 2019లో జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మద్యం షాపులు తగ్గించి క్రమబద్ధీకరించారని అన్నారు. 2024 లో తిరిగి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మద్యం షాపులు టిడిపి నాయకులకు అప్పగించి మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని అన్నారు. ఎన్నికలలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏమయ్యాయి అని ప్రశ్నించారు 50 సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చారని అది ఏమైందని ప్రశ్నించారు. బీసీలకు రక్షణ చట్టం తీసుకొస్తామని ఇచ్చిన హామీ ఏమైందని అన్నారు. బీసీలపై దాడులు ఆపకపోతే బీసీలు ఏకమై బహిరంగ సభ నిర్వహించి కూటమి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ఉద్యమిస్తామని హెచ్చరించారు.





ఫోక్ డాన్సర్ దగ్గర నుంచి ఇప్పుడు హీరోయిన్‌గా..!

# నాగ దుర్గకు క్రేజీ ఆఫర్స్

తన డాన్స్‌తో ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకుంది. ఫోక్స్ సాంగ్స్ తో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది ఈ అందాల భామ నాగ దుర్గ. చూడచక్కని రూపంతో చక్కటి డాన్స్ తో కట్టిపడేస్తుంది ఫోక్ డాన్సర్ నాగ దుర్గ. తన డాన్స్ తో మంది అభిమానులను సొంతం చేసుకుంది నాగ దుర్గ. ఈ చిన్నదానికి సినిమా హీరోయిన్స్ కు మంచి క్రేజ్ ఉంది. ఈ అమ్మడి సాంగ్స్ యూట్యూబ్‌లో మిలియన్ వ్యూస్ సొంతం చేసుకుంటూ దూసుకుపోతున్నాయి. ఫోక్ సాంగ్స్‌తో పాటు పలు ఇంటర్వ్యూల్లోనూ పాల్గొంటుంది ఈ చిన్నది. నాగ దుర్గ సాంగ్స్ కోసం ఆడియన్స్ ఈగర్‌గా ఎదురుచూస్తుంటారు. రీసెంట్ గాను లగారే సౌండ్ సాలా అనే సాంగ్ తో అభిమానులను ఆకట్టుకుంది. ఒకటి కాదు రెండు కాదు.. వందల పాటలలో ప్రధాన పాత్రలో కనిపిస్తూ తమకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది నాగ దుర్గ . పల్లె పాటలకు ఎనర్జిటిక్ డ్యాన్సులతో అదరగొడుతుంది. కేవలం డాన్సర్‌గానే కాకుండా, తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్, విభిన్నమైన కాస్ట్యూమ్స్‌తో సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారారు. ఇక ఇప్పుడు హీరోయిన్‌గా మారిపోయింది నాగ దుర్గ. ఈ అందాల భామకు తెలుగులో కాదు తమిళ్ లోనూ ఛాన్స్ అందుకుంది. ఏకంగా ధనుష్ మేనల్లుడి సినిమాలో హీరోయిన్‌గా ఛాన్స్ దక్కించుకుంది. కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ మేనల్లుడు పవీష్.. జాబిలమ్మ నీకు అంత కోపమా సినిమాతో.. తెలుగులోనూ గుర్తింపు తెచ్చుకున్నాడు. అయితే ఈయన హీరోగా రెండో ప్రాజెక్ట్ స్టార్ట్ అయింది. ఈ సినిమాలో నాగ దుర్గ హీరోయిన్‌గా నటిస్తుంది. పవీష్ రెండో సినిమాకు కొత్త డైరెక్టర్ మగేష్ రాజేంద్రన్ దర్శకత్వం వహించనున్నారు. ఆయన గతంలో తమిళంలో వచ్చిన బోగన్ సినిమాకు డైరెక్షన్ డిపార్ట్ మెంట్‌లో పనిచేశాడు. ఇక ఇప్పుడు దర్శకుడిగా సినీరంగంలోకి అడుగుపెట్టబోతున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి టీజర్ విడుదల చేశారు. ఈ సినిమాకు లవ్ ఓ లవ్ అనే ఇంట్రెస్టింగ్ టైటిల్ ను ఖరారు చేశారు. ఈ సినిమా తర్వాత నాగ దుర్గ తెలుగులోనూ మంచి అవకాశాలు అందుకోవడం ఖాయంగా కనిపిస్తుంది.

# మాట నిలబెట్టుకున్న తమన్..


## మహేష్ బాబు అభిమాని కోసం ఏం చేశారో తెలుసా?



అభిమానులకు పూనకాలు వచ్చేలా మ్యూజిక్ వాయించడమే కాదు.. ఇబ్బందుల్లో ఉన్న వారికి తన వంతు సాయం చేస్తుంటారు మ్యూజిక్ డైరెక్టర్ తమన్. తాజాగా మరోసారి గొప్ప మనసును చాటుకున్నారీ సంగీత దర్శకుడు. గతంలో మహేష్ బాబు అభిమానికి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ.. సినిమాలు, సాంగ్స్ సంగతి పక్కన పెడితే తమన్ కు సామాజిక స్పృహ ఎక్కువ. కష్టాల్లో ఉన్న వారికి తన వంతు సాయం చేస్తాడు. గతంలో ఇండియన్ ఐడల్ షోతో పాటు వివిధ టీవీ షోల వేదికగానే చాలా మందికి ఆపన్న హస్తం అందించారీ మ్యూజిక్ డైరెక్టర్. తాజాగా మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారు తమన్. గతంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ఓ అభిమానికి ఆపన్న హస్తం అందించారు. తద్వారా ఆ కుటుంబం కళ్లల్లో వెలుగులు నింపారు. వివరాల్లోకి వెళితే.. కొన్ని నెలల క్రితం రాజేశ్ అనే మహేష్ బాబు వీరాభిమాని తీవ్ర అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు భార్య ఒక బాబు, పాప ఉన్నారు. రాజేష్ దీన స్థితి తెలుసుకున్న బేబీ నిర్మాత ఎస్కేఎన్ ఆ కుటుంబానికి రూ.2 లక్షలు ఆర్థిక సాయం అందించారు. అదే సమయంలో ఎస్కేఎన్ పెట్టిన ట్వీట్ కు తమన్ స్పందించారు. రాజేష్ పిల్లల చదువుకు సంబంధించి పూర్తి బాధ్యత నేను తీసుకుంటా. వారి వివరాలను చెప్పండి' అని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే తమన్ తాజాగా ఓ ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టారు. అదేంటంటే.. ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ రీసెంట్ గా నిరంజన్ అనే తన చిన్నారి అభిమానిని కలిసిన సంగతి తెలిసిందే. ఈ ఫొటోలను ట్విట్టర్ లో షేర్ చేసిన తమన్.. 'లీడర్' అని క్యాప్షన్ ఇచ్చారు. ఇదే పోస్ట్ కు మహేష్ బాబు అభిమాని ఒకరు స్పందిస్తూ.. ' అన్నా.. గతంలో మీరు ఇచ్చిన మాట కోసం ఎదురు చూస్తున్నా. దయచేసి సమాధానం ఇవ్వండి. ఇప్పటికే స్కూల్ కూడా ప్రారంభమైంది' అని తమన్‌ను కోట్ చేశారు. దీనికి తమన్ వెంటనే స్పందించాడు. రాజేశ్ బిడ్డలు శివరామ్, సారికశ్రీల స్కూల్ ఫీజును చెల్లించి, అందుకు సంబంధించిన రశీదులను ఎక్స్ (ట్విట్టర్) లో పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది. అభిమాని పిల్లల స్కూల్ ఫీజులు చెల్లించిన ఈ మ్యూజిక డైరెక్టర్ పై సర్వత్రా ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం తమన్ చేతిలో పలు క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. అఖిల్ లెనిన్, ఎన్బీకే 111, మెగా 158 వంటి భారీ బడ్జెట్ సినిమాలకు తమన్ సంగీత అందిస్తున్నారు.

# మోదీ జీ.. మీరు జోక్యం చేసుకోండి

## మనికా బాత్రా పోస్టు వైరల్



ఆసియా గేమ్స్ ఎంపికపై టేబుల్ టెన్నిస్ స్టార్ మనికా బాత్రా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జపాన్ వేదికగా మరికొద్ది రోజుల్లో ఆసియా గేమ్స్ జరగనున్నాయి. ఇందులో పాల్గొనే అథ్లెట్ల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. అయితే, టేబుల్ టెన్నిస్ జట్టులో మనికా బాత్రాకు చోటు దక్కలేదు. దీంతో ఎంపిక విధానం పారదర్శకంగా లేదని.. ప్రధాని నరేంద్ర మోదీ, క్రీడాశాఖ మంత్రి మాన్‌సుఖ్ మాండవీయ జోక్యం చేసుకోవాలని సోషల్ మీడియా వేదికగా మనికా పోస్టు చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. "ఆసియా క్రీడలకు నేను ఎంపిక కాకపోవడం తీవ్ర నిరాశకు గురిచేసింది. అయితే, నన్ను సెలక్ట్ చేయకపోవడానికిగల కారణాలను ఫెడరేషన్ తెలియజేయలేదు. ఇప్పుడు నా విషయంలో.. గత ఎంపిక ప్రక్రియలో వేర్వేరు ప్రమాణాలు, అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్లు అనిపిస్తోంది. దీనివల్ల ఈ విధానం స్థిరత్వంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గత ఆసియా క్రీడల ఎంపిక నిబంధనలే వర్తించాల్సి ఉంటే.. ఇప్పుడు ఎలా అన్వయించారనే దానిపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది" అని పోస్టు పెట్టిన మనికా.. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర క్రీడాశాఖ మంత్రి మాన్‌సుఖ్ మాండవీయను ట్యాగ్ చేసింది. వ్యక్తిగత విభాగంలో మనికా బాత్రా భారత్ తరఫున రెండో అత్యుత్తమ ర్యాంకర్. 31ఏళ్ల మనికా గత ఒలింపిక్స్‌లోనూ భారత్‌కు ప్రాతినిధ్యం వహించింది. ఈసారి ఆసియా గేమ్స్‌కు అర్హత సాధించలేకపోయింది. జపాన్ వేదికగా సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు ఆసియా గేమ్స్ జరగనున్నాయి.

దిల్లీ క్యాపిటల్స్

# కోచ్‌గా యువరాజ్ సింగ్



భారత మాజీ స్టార్ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ ఐపీఎల్‌లోకి అడుగు పెట్టనున్నాడు. అదేంటీ.. అతడు క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు కదా అనే అనుమానం రాకమానదు. అయితే, ప్లేయర్‌గా కాకుండా కోచ్‌గా సేవలు అందించేందుకు సిద్ధమవుతున్నట్లు ఐపీఎల్ వర్గాలు తెలిపాయి. వచ్చే సీజన్ నుంచి దిల్లీ క్యాపిటల్స్ బ్యాటింగ్ కోచ్‌గా బాధ్యతలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

**గంగూలీ రాకతో..**

టీమ్ఇండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ మళ్లీ దిల్లీ జట్టుతో కలిసి పనిచేయనున్నాడు. యువరాజ్‌ను దిల్లీ జట్టుకు తీసుకురావాలని గంగూలీ అనుకున్నాడని.. అతడి సూచన మేరకే మేనేజ్‌మెంట్ అంగీకరించినట్లుగా కథనాలు వస్తున్నాయి. యువరాజ్ సైతం దిల్లీతో పనిచేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. గత రెండు సీజన్లలో గంగూలీ దిల్లీ క్యాపిటల్స్ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా సేవలు అందించాడు. కొత్త సీజన్ సమయానికి జట్టులో, సహాయక సిబ్బంది బృందంలోనూ మార్పులు చేసేందుకు దిల్లీ మేనేజ్‌మెంట్ సమాలోచనలు చేస్తున్నట్లు సమాచారం.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

# మరో నాలుగేళ్లు ఆడతాడు

## విరాట్ రిటైర్‌మెంట్‌పై ఆర్సీబీ సీఈవో



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో విరాట్ కోహ్లీకి ఉన్న అనుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఐపీఎల్ ప్రారంభం నుంచి ఒకేఒక్క ఫ్రాంఛైజీకి ప్రాతినిధ్యం వహిస్తోన్న ఏకైక ప్లేయర్ విరాట్ కోహ్లీనే. రెండుసార్లు విజేతగా నిలవడంలో అతడిదే కీలక పాత్ర. ఇప్పటికే అంతర్జాతీయంగా టీ20, టెస్టులకు వీడ్కోలు పలికిన విరాట్.. వచ్చే ఏడాది వన్డే ప్రపంచ కప్ తర్వాత ఆ ఫార్మాట్‌కూ గుడ్‌బై చెప్పేస్తాడని వార్తలు వస్తున్నాయి. అలాగే వచ్చే ఐపీఎల్ సీజన్ అనంతరం మెగా లీగ్‌కు వీడ్కోలు పలుకుతాడని చర్చ మొదలైంది. అయితే, వీటిని ఆర్సీబీ సీఈవో రాజేశ్ మేనన్ కొట్టిపడేశారు. "ఒకే నాణేనికి ఆర్సీబీ, విరాట్ రెండు ముఖాలు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో ఎన్నో ఏళ్ల అనుబంధం ఉంది. ఒకవేళ అతడు క్రికెట్‌కు దూరమైనా సరే.. ఆర్సీబీలో భాగం కాకుండా ఉండటాన్ని మేం ఊహించలేం. తప్పకుండా దీని గురించి ఆలోచన చేస్తాం. ఇప్పటికప్పుడు విరాట్ ఐపీఎల్‌ను వదిలిపెట్టడు. కనీసం మూడు లేదా నాలుగేళ్లు ఆడతాడు. అతడి ఫిట్‌నెస్ చాలా బాగుంది. ఇప్పటికీ పరుగుల దాహం తీరలేదు. ఇటీవల సీజన్‌లో కోహ్లీని చూస్తే ఇట్టే అర్థమైపోతుంది" అని రాజేశ్ స్పష్టం చేశారు.

**ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ కోసం..**

ఐపీఎల్ ముగిసిన తర్వాత భారత్ అఫ్గాన్‌తో టెస్టు మ్యాచ్ ఆడింది. వన్డే సిరీస్ ఆడుతోంది. అయితే, గాయం కారణంగా విరాట్ అఫ్గాన్‌తో వన్డేలకు దూరంగా ఉన్నాడు. ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ నాటికి జట్టుతో పాటు చేరేందుకు ప్రయత్నిస్తున్నట్లు క్రికెట్ వర్గాలు తెలిపాయి. "విరాట్ రిహాబిలిటేషన్ మొదలైంది. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో రిపోర్ట్ చేయనున్నాడు. అక్కడ ఫిట్‌నెస్‌పై అంచనాకు వచ్చి.. క్లియరెన్స్ జారీ చేయనుంది. అనుకున్నవిధంగా సాగితే.. కోహ్లీ ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ నాటికి సిద్ధంగా ఉంటాడు" అని పేర్కొన్నాయి.

# ముక్కోణపు సిరీస్.. శ్రీలంకనే భారత్-ఏ 'ఫైనల్' ప్రత్యర్థి



ముక్కోణపు సిరీస్‌లో భారత్ ఎ జట్టుకు 'ఫైనల్' మ్యాచ్ ప్రత్యర్థి ఎవరో తేలిపోయింది. అఫ్గానిస్థాన్‌తో జరిగిన కీలక పోరులో శ్రీలంక-ఏ 103 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో ఆదివారం జరగనున్న ఫైనల్‌లో భారత్‌-శ్రీలంక ఎ జట్లు తలపడతాయి. భారీ విజయం సాధిస్తేనే ఫైనల్‌కు చేరే అవకాశం ఉన్న నేపథ్యంలో.. అఫ్గాన్ అందుకు తగినట్లు దూకుడు ప్రదర్శించలేక ఓటమితో ఇంటిముఖం పట్టింది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 322 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో అఫ్గాన్ 42.5 ఓవర్లలో 219 పరుగులకు ఆలౌటైంది. ఫైనల్‌కు చేరాలంటే శ్రీలంక ఇచ్చిన టార్గెట్‌ను 29.3 ఓవర్లలోనే అఫ్గాన్ ఛేదించాల్సి ఉంది. కానీ, ఆ దిశగా అఫ్గాన్ ఇన్నింగ్స్ సాగలేదు. దీంతో ముందే లంకకు ఫైనల్ బెర్తు ఖాయమైపోయింది. అఫ్గాన్ ఓపెనర్ హస్సన్ ఐసాఖిల్ (74), ఫార్మనుల్లా సాఫి (43), బహిర్ షా (35) మాత్రమే రాణించారు. లంక బౌలర్లలో దులాజ్ (5/25) ఫైఫర్‌తోపాటు మథులన్ 3.. రవిందు ఫెర్నాండో, విజయ్‌కాంత్ ఒక్కో వికెట్ తీశారు.

**సెంచరీతో అదరగొట్టి..**

ఇన్నింగ్స్ ఆరంభం నుంచే శ్రీలంక దూకుడుగా ఆడింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంకకు ఓపెనర్లు నిరోషన్ డిక్వెల్లా (66), అవిష్క ఫెర్నాండో (110) శుభారంభం ఇచ్చారు. తొలి వికెట్‌కు శతకం (133) భాగస్వామ్యాన్ని నిర్మించారు. నిరోషన్ ఔటైనా.. నువానిదు ఫెర్నాండో (45)తో కలిసి అవిష్క ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఈ క్రమంలో అతడు సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆఖర్లో రవిందు ఫెర్నాండో (25) దూకుడుగా ఆడటంతో శ్రీలంక 322 పరుగుల భారీ స్కోరును చేయగలిగింది. అఫ్గాన్ బౌలర్లలో ఫరీదూన్ 4, సాఫి 3, మహ్మద్ ఇబ్రహీం ఒక వికెట్ తీశారు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com